



బుధవారం 22 జూలై 2026 పేజీలు : 8


# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి



రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టికను ఖచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు.

# కాంగ్రెస్ కు ఓటేసినా పాపానికి ప్రజలు నరకం చూస్తున్నారు



- కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే కానీ కాలం తెచ్చిన కరువు కాదిది
- నాలుగుసార్లు రైతుబంధు ఎగొట్టిన ప్రభుత్వమిది.
- కాళేశ్వరంపై రేవంత్ అబద్దాల ప్రచారం.
- వరంగల్ రైతులు డిక్లరేషన్ ఏమైంది?
- మరణించిన రైతు కుటుంబాలకు చెక్కులు అందజేత.
- మంచిర్యాల ఎమ్మెల్యే పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించిన కేటీఆర్

# మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలి



- త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి
- ప్రతి రైతు ఫామ్ పాండ్‌ల నిర్మాణానికి ముందుకు రావాలి
- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



# యోగతో ఆరోగ్యమే కాదు.. విలువలతో కూడిన జీవితానికి బాటలు

## తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో అవగాహన కార్యక్రమం



**మంచిర్యాల, 21, జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో చరిత్ర, సంస్కృతి--వారసత్వ అధ్యయనంలో భాగంగా విద్యార్థినుల్లో ఆరోగ్యకరమైన జీవనశైలి, నైతిక విలువలు, సామాజిక బాధ్యతలపై అవగాహన కల్పించేందుకు "యోగ ఆరోగ్యం, సంస్కృతి, వ్యక్తిత్వ వికాసం" అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కళాశాల చరిత్ర విభాగాధిపతి పి. సత్యరాణి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు కె. వెంకటేశ్వర్లు విద్యార్థినులకు యోగాసనాల ప్రాముఖ్యత, వాటిని ప్రతిరోజూ ఆచరించడం వల్ల కలిగే శారీరక, మానసిక ప్రయోజనాలను వివరించారు. అలాగే సత్ప్రవర్తన, క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక సమస్యల పట్ల యువత బాధ్యత, మాదకద్రవ్యాల నివారణ, ఒత్తిడి నిర్వహణ, సమాజ సేవ వంటి అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. అనంతరం పలు యోగాసనాలను ప్రదర్శించి వాటి సాధన విధానాన్ని వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామక పాండురంగ శర్మ మాట్లాడుతూ, యోగ భారతీయ సంస్కృతికి ప్రతీక అని, ఇది శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రతను పెంపొందిస్తుందని తెలిపారు. విద్యార్థినులు ప్రతిరోజూ కొంత సమయం యోగాభ్యాసానికి కేటాయించి ఆరోగ్యవంతమైన జీవనశైలిని అలవర్చుకోవాలని, మంచి విలువలు, క్రమశిక్షణతో సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ఇటువంటి అవగాహన కార్యక్రమాలు విద్యార్థుల సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ ప్రక్రియ వేగవంతం చేయాలి




రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి
వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల, 21, జూలై (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేసి, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపట్టికను ఖచ్చితంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఈఆర్ఓలు, ఏఈఆర్ఓలతో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి పౌరుడి పేరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అనర్హుల పేర్ల తొలగింపు, ఓటరు వివరాల సవరణ వంటి ప్రక్రియలను పూర్తిగా పారదర్శకంగా, భారత ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి సమగ్ర సమాచారాన్ని సేకరించి, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పిస్తూ దరఖాస్తులను స్వీకరించాలని, అందిన ఫారాలు, దరఖాస్తులను ఎలాంటి జాప్యం లేకుండా పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని ఆదేశించారు. ఓటరు జాబితా సవరణలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా ప్రతి దరఖాస్తును నిష్పక్షపాతంగా పరిశీలించి, ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే జిల్లాల వారీగా ప్రతిరోజూ పురోగతిని సమీక్షిస్తూ పెండింగ్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియను అధికారుల సమన్వయంతో వేగవంతం చేస్తూ, నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు, వాలంటీర్లు, యువత సమన్వయంతో ఇంటింటి సర్వే నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఓటరును నమోదు చేయడం, అవసరమైన సవరణలు చేయడం, దరఖాస్తుల పరిశీలనను వేగవంతం చేయడం జరుగుతోందని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, ప్రత్యేక ఉపపాలన అధికారి చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతీరామ్‌తో పాటు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కేటీఆర్ సభకు బయలుదేరిన బిఆర్ఎస్ నాయకులు



**జన్నారం,జూలై21(ప్రజాజ్యోతి)** మంచిర్యాల జిల్లా లక్షెటిపేట లో మంగళవారం నిర్వహించనున్న రైతు సదస్సు కు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్న నేపథ్యంలో ఖానాపూర్ నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ భూక్య జాన్సన్ నాయక్ ఆధ్వర్యంలో నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా జాన్సన్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలను కొనసాగిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ హయాంలో రైతులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని పేర్కొన్నారు. పండిన పంటకు గిట్టుబాటు ధర అందించడం లేదన్నారు. రైతులకు విత్తనాలు, ఎరువులు సక్రమంగా అందించడంలో విఫలమయ్యారన్నారు. రానున్న రోజుల్లో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్తారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఆశ్రమ పాఠశాలల్లో నాణ్యతపై రాజీ లేదు

**గిరిజన విద్యార్థుల విద్య, ఆరోగ్యమే లక్ష్యం: జాదవ్ అంబాజీ**




**ఆసిఫాబాద్, జూలై 21 ప్రజా జ్యోతి** జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పోషకాహారం, పరిశుభ్రమైన వాతావరణం కల్పించడంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించబోమని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి జాదవ్ అంబాజీ స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో నిర్వహించిన ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ అధికారులు, ఎస్‌సీఆర్పీల సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలోని 52 ఆశ్రమ వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడంతో పాటు పరిశుభ్రతను కచ్చితంగా పాటించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ అధికారులు తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లోనే ఉంటూ విద్యార్థుల చదువు, ఆరోగ్యం, క్రమశిక్షణ, భద్రతను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరంలో హెచ్ఎఫ్ఎల్ఎన్, లీప్ కార్యక్రమాలను వంద శాతం అమలు చేయాలని, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి నిర్ణీత గడువులోగా సిలబస్ పూర్తి చేయాలని సూచించారు. జీసీసీ ద్వారా సరఫరా అయ్యే బియ్యం, పప్పులు, ఇతర నిత్యావసర సరుకులను నాణ్యత పరిశీలించిన తర్వాతే స్వీకరించాలని, నాసిరకం సరుకులను ఎట్టి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దని స్పష్టం చేశారు. వసతి గృహాల్లోకి బయటి ఆహార పదార్థాలను అనుమతించవద్దని, వంటశాలలు, భోజనశాలలు, హాస్టల్ ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. విద్యార్థుల ఆరోగ్యం, భద్రత విషయంలో అలసత్వం ప్రదర్శిస్తే సంబంధిత అధికారుల పై బాధ్యత నిర్ణయిస్తామని హెచ్చరించారు. సమావేశంలో పీఎంఆర్సీ ఏసీఎంఓ పూర్కా ఉద్ధవ్, జిల్లా క్రీడల అధికారి మడావి శేఖు, జీసీడీఓ కె. శకుంతల, ఏటీడీఓలు భాస్కర్, శ్రీనివాస్, చిరంజీవి, జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ కు ఓటేసినా పాపానికి ప్రజలు నరకం చూస్తున్నారు

--కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే కానీ కాలం తెచ్చిన కరువు కాదిది
--నాలుగుసార్లు రైతుబంధు ఎగొట్టిన ప్రభుత్వమిది.
--కాళేశ్వరంపై రేవంత్ అబద్దాల ప్రచారం.
--వరంగల్ రైతుల డిక్లరేషన్ ఏమైంది?
--మరణించిన రైతు కుటుంబాలకు చెక్కులు అందజేత.
--మంచిర్యాల ఎమ్మెల్యే పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించిన కేటీఆర్



**లక్సెట్టిపేట జులై 21(ప్రజాజ్యోతి):** కాంగ్రెస్ కు ఓటేసినా పాపానికి ప్రజలు నరకం చూస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండలం లోని అంకతిపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్లో మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన రైతు సదస్సులో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....ఇది కాంగ్రెస్ ప్రభుత్వం తెచ్చిన కరువే కానీ కాలం తెచ్చిన కరువు కాదన్నారు. రాష్ట్రానికి ఎల్నినో ప్రభావం చేసిన నష్టం కంటే కాంగ్రెస్ చేసిన నష్టమే ఎక్కువన్నారు. కన్నెపల్లి లో ఉన్న వాటర్ ను రోజుకు మూడు టీఎంసీ ల చొప్పున అన్నారం, సుందిల్లా, ఎల్లంపల్లి బ్యారేజ్ లకు బ్యాక్ వాటర్ ఎందుకు పంపడలేదు అని రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు?. ఒక్క ఎల్నినో కాదు ఇంకొక ఎల్నినో వచ్చిన మన రాష్ట్రానికి కరువు రాకుండా బ్యారేజ్ లు కట్టి బాహుబలి మోటార్లు పెట్టించిన ఘనత మన కేసీఆర్ దేనని అన్నారు. ఎన్నికలకు ముందు రైతుబంధు కెసిఆర్ కంటే ఎక్కువ ఇస్తా అని ప్రజలను మభ్యపెట్టి నాలుగు సార్లు ఎగొట్టిన ఘనుడు రేవంత్ రెడ్డి అని ఏద్దేవా చేశారు. అంతేకాకుండా నిరుద్యోగ భృతి, రెండు లక్షల ఉద్యోగాలు, రైతులకు రెండు లక్షల రుణమాఫీ ఇలా ఇచ్చిన హామీలన్నిటిని తుంగలో తొక్కాడన్నారు. కాళేశ్వరంపై రేవంత్ రెండు పిల్లర్స్ దెబ్బతిన్నాయని చెప్పి,32 నెలలుగా ఎందుకు రిపేర్ చేయించలేదని ప్రశ్నించారు?. కాళేశ్వరం ప్రాజెక్టు మీద బూటకపు ప్రచారాలు చేస్తూ రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వడం లేదని మండిపడ్డారు. అదేవిధంగా రేవంత్ రెడ్డి వరంగల్ సభలో ఏక కాలంలో రైతులకు రూ. 2 లక్షలు రుణమాఫీ చేస్తానని మోసం చేశాడన్నారు. 32 నెలలు గడచిన ఎందుకు రుణమాఫీ చేయలేదని ప్రశ్నించారు?. మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు తన పద్ధతిని మార్చుకోవాలని హెచ్చరించారు. నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలే కానీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడవద్దన్నారు. అదేవిధంగా అకాల వర్షానికి గోడలు కూలి రైతులు మరణిస్తే రెండున్నర నెలలు గడచినా వారికి ఎలాంటి సహాయం అందలేదని బాధను వ్యక్తం చేశారు. చివరికి కే సీ ఆర్ ప్రవేశపెట్టిన రైతుభీమా ద్వారా ఒక్క రైతు కుటుంబానికి మాత్రమే రూ. 5లక్షలు అందాయన్నారు. మరణించిన నలుగురు రైతు కుటుంబాలకు రూ.5లక్షల చెక్కులను కే టీ ఆర్ అందజేశారు. రైతులు చనిపోతున్న రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి లేదా అని ప్రశ్నించారు?. ఇంకొక్క 28 నెలల్లో కెసిఆర్ ప్రభుత్వం వస్తుందని ఈ చేతకాని, రైతులను పట్టించుకోని ప్రభుత్వం పడిపోతుందని ప్రజలు ఆందోళన చెందవద్దన్నారు. ఈ కార్యక్రమంలోజిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, జోగు రామన్న, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మీ, సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యేలు కోరుకంటి చందర్, దాసరి మనోహర్ రెడ్డి, సుంకే రవి, కోనేరు కోనప్ప, దుర్గం చిన్నయ్య, మాజీ ఫిల్మ్ కార్పొరేషన్ డెవలప్మెంట్ చైర్మన్ రామ్మోహన్ రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు, రాష్ట్ర నాయకులు విజిత్ రావు, మాజీ డీసీఎమ్మెస్ తిప్పని లింగయ్య, మాజీ మున్సిపల్ చైర్మన్ కాంతయ్య, వైస్ చైర్మన్ పోడేటి శ్రీనివాస్ గౌడ్, సర్పంచ్ లు ఎల్తాపు సుధాకర్, మాజీ సర్పంచ్ సొల్లు సురేష్, మాజీ యూత్ అధ్యక్షులు మారిశెట్టి సుమన్, స్థానిక నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఏరియా వ్యాప్తంగా మొక్కల పెంపకం ఒక నిరంతర ప్రక్రియలా కొనసాగుతోంది

ప్రతీ ఏటా రెండు నుంచి మూడు లక్షల మొక్కలు నాటుతున్నాం
శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్



**మంచిర్యాల, 21, జులై (ప్రజాజ్యోతి):**సింగరేణిలో పచ్చదనానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ఏరియా వ్యాప్తంగా మొక్కల పెంపకాన్ని నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నామని శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ మునిగంటి శ్రీనివాస్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం "ఏక్ పేడ్ మా కే నామ్" నినాదంతో చేపట్టిన మొక్కల పెంపక కార్యక్రమంలో భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ (సీసీఓ) ఆదేశాల మేరకు శ్రీరాంపూర్ ఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో జీఎం కార్యాలయం ఎదుట ఉన్న సెంట్రల్ నర్సరీలో మంగళవారం నిర్వహించిన మెగా ప్లాంటేషన్ కార్యక్రమం లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏడాది శ్రీరాంపూర్ ఏరియా పరిధిలో రెండు నుంచి మూడు లక్షల మొక్కలను నాటుతున్నామని, ఈ ఏడాది కూడా రెండు లక్షలకు పైగా మొక్కల పెంపకం లక్ష్యంగా కార్యక్రమాలు కొనసాగుతున్నాయని జీఎం తెలిపారు. జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఐకే ఓసీలో రెండు వేల మొక్కలు నాటినట్లు గుర్తు చేశారు. "ప్రతి మొక్క తల్లితో సమానం. 'ఏక్ పేడ్ మా కే నామ్' పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో స్ఫూర్తిదాయకం. అందులో భాగస్వాములు కావడం ఆనందంగా ఉంది. పర్యావరణ పరిరక్షణ కోసం ఓపెన్‌కాస్ట్ గనుల ఓబీ డంప్‌లపై కూడా పెద్ద ఎత్తున మొక్కలు పెంచుతున్నాం" అని మునిగంటి శ్రీనివాస్ తెలిపారు .అనంతరం జీఎం మునిగంటి శ్రీనివాస్ మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుర్తింపు సంఘం బ్రాంచి సెక్రటరీ బాజీ సైదా, ఏరియా ఇంజనీర్ రమణరావు, ఎస్వో-2 టు జీఎం కృష్ణ ప్రసాద్, ఏజీఎం (ఫైనాన్స్) సుమలతతో పాటు వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు మొక్కలు నాటి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో డీజీఎం (ఫారెస్ట్) హరినారాయణ, డీజీఎం (సేఫ్టీ) విజయ్‌కుమార్, డీజీఎం (ఐఈడీ) రాజన్న, డీజీఎం (ఈఎం) సురేష్, డీజీఎం (వర్క్‌షాప్) కృష్ణారెడ్డి, ఏరియా సర్వేయర్ నర్సింగరావు, ఏరియా సెక్యూరిటీ ఆఫీసర్ జక్కారెడ్డి, పిట్ సెక్రటరీ సందీప్, జీఎం కార్యాలయ వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## హైవేలపై ప్రమాదాల నివారణకు చర్యలు వేగవంతం

ప్రతి నెల రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించాలి
: వికాస్ రాజ్




**ఆసిఫాబాద్, జూలై 21 ప్రజ జ్యోతి** జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు సమగ్ర చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, రవాణా, రహదారులు–భవనాలు, జాతీయ రహదారుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రతి నెల జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను ఆసుపత్రులకు తరలించేలా అంబులెన్స్‌లు సిద్ధంగా ఉంచాలని, వాహనదారుల్లో హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై అవగాహన పెంచాలని తెలిపారు. జిల్లా సమీకృత కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ కె. హరిత, ఎస్పీ నితికా పంత్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. జిల్లాలో 52 కిలోమీటర్ల జాతీయ రహదారిపై భద్రతా చర్యలు అమలు చేస్తున్నామని, బ్లాక్ స్పాట్లను గుర్తించి అవసరమైన రక్షణ చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. అనంతరం లారీ డ్రైవర్లకు కంటి అద్దాలు పంపిణీ చేశారు.

## ఎస్ఐఆర్ ఫారాలు వెంటనే సమర్పించాలి

ఫారం ఇవ్వకపోతే ఓటరు జాబితాలో పేరు నమోదుకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం
38వ డివిజన్ ప్రజలకు కార్పొరేటర్ పూదరి విజయరాణి తిరుపతి విజ్ఞప్తి

**మంచిర్యాల, 21, జులై (ప్రజాజ్యోతి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియలో ప్రజలు నిర్లక్ష్యం చేయవద్దని 38వ డివిజన్ కార్పొరేటర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు పూదరి విజయరాణి తిరుపతి విజ్ఞప్తి చేశారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆమె మాట్లాడుతూ, గత నెల 25 నుంచి ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్ కార్యక్రమం కొనసాగుతున్నప్పటికీ ఇప్పటికీ చాలామంది ఫారాలు తీసుకోలేదని, ఫారాలు తీసుకున్న వారిలో కూడా చాలా మంది వాటిని పూర్తి చేసి తిరిగి సమర్పించలేదని తెలిపారు. ఈ విషయమై ఇప్పటికే పలుమార్లు వాట్సాప్ గ్రూపుల ద్వారా సందేశాలు పంపడంతో పాటు ఫోన్ ద్వారా కూడా ప్రజలకు సమాచారం అందించినప్పటికీ కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. నిర్ణీత గడువులోపు ఫారాలు సమర్పించని పక్షంలో ఓటరు జాబితాలో పేరు నమోదు కాకపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వ రికార్డుల్లో వివరాలు సక్రమంగా లేకపోతే భవిష్యత్తులో వివిధ ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. అందువల్ల ఫారాలు తీసుకున్న ప్రతి ఒక్కరూ వెంటనే వాటిని పూర్తి చేసి సంబంధిత అధికారులకు అందజేయాలని కోరారు. చివరి వరకు వేచి చూడకుండా ప్రజలందరూ బాధ్యతగా వ్యవహరించి ఎస్ఐఆర్ ప్రక్రియను విజయవంతం చేయాలని పూదరి విజయరాణి తిరుపతి పిలుపునిచ్చారు.

# సింగరేణిలో మెడికల్ బోర్డుపై మెడికల్ బోర్డుపై "ప్రజాజ్యోతి" లో ప్రత్యేక కథనం




**మళ్లీ మంటలు... సింగరేణిలో కొత్త వివాదం**

**గైర్హాజరైన 28 మందికి మరో అవకాశం ఇవ్వాలా?...**

**హాజరైన వారందరినీ అన్‌ఫిట్ చేయాలనే డిమాండ్ సాధ్యమేనా?**

**కార్మిక సంఘాల ఆరోపణలు.. యాజమాన్యంపై విమర్శలు..**

**విజిలెన్స్ విచారణతోనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయా?**

**మంచిర్యాల, 21, జులై (ప్రజాజ్యోతి):** సింగరేణి సంస్థలో మెడికల్ అన్‌ఫిట్ ప్రక్రియ మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. ఈ నెల 17, 18 తేదీల్లో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన ఆసుపత్రిలో నిర్వహించిన మెడికల్ బోర్డు అనంతరం కార్మిక సంఘాల ఆరోపణలు, యాజమాన్యంపై విమర్శలు, గైర్హాజరైన కార్మికులకు మరో అవకాశం కల్పించాలనే డిమాండ్లు ఒకవైపు వినిపిస్తుండగా, మరోవైపు మెడికల్ బోర్డుకు హాజరైన వారందరినీ అన్‌ఫిట్ చేయాలనే డిమాండ్ కూడా చర్చనీయాంశంగా మారింది. దీంతో ఈ మొత్తం వ్యవహారం సింగరేణిలో హాట్‌టాపిక్‌గా మారింది.

**28 మంది గైర్హాజరు... కారణం ఆలస్యంగా సమాచారం?**

యాజమాన్యం మొత్తం 120 మంది కార్మికులను మెడికల్ బోర్డుకు పిలవగా, 92 మంది మాత్రమే హాజరయ్యారు. 28 మంది గైర్హాజరయ్యారు. సమాచారం ఒక్కరోజు ముందే ఇవ్వడంతో పలువురు ఇతర ప్రాంతాల్లో ఉండటం, వ్యక్తిగత అవసరాల కోసం వెళ్లి ఉండటం వల్ల హాజరు కాలేకపోయారని కార్మిక సంఘాలు చెబుతున్నాయి. ఉద్దేశపూర్వకంగా గైర్హాజరు కాలేదని, ప్రత్యేక మెడికల్ బోర్డు నిర్వహించి మరో అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి.

**డిపెండెంట్ ఉద్యోగాల కోసం కీలక ప్రక్రియ**

సింగరేణిలో మెడికల్‌గా అన్‌ఫిట్‌గా ప్రకటించిన కార్మికుల అర్హులైన వారసులకు డిపెండెంట్ ఉద్యోగాలు కల్పించే విధానం అమల్లో ఉంది. అందువల్ల మెడికల్ బోర్డు ప్రతి కార్మిక కుటుంబానికి అత్యంత కీలకమైన అంశంగా మారింది. అనారోగ్యంతో విధులు నిర్వహించలేని కార్మికులకు ఇది జీవితాంతం భరోసా కల్పించే అవకాశం కావడంతో ప్రతి బోర్డు సమయంలో భారీగా ఆశలు నెలకొంటాయి.

**24 మందికే అన్‌ఫిట్... ఏఐటీయూసీ ఆగ్రహం**

ఇటీవల నిర్వహించిన మెడికల్ బోర్డుకు హాజరైన 124 మంది కార్మికుల్లో కేవలం 24 మందిని మాత్రమే మెడికల్ అన్‌ఫిట్‌గా ప్రకటించారని ఏఐటీయూసీ ఆరోపించింది. ఇది గతంలో ఎన్నడూ లేని పరిస్థితి అని పేర్కొంటూ, అర్హులైన కార్మికులకు అన్యాయం జరిగిందని విమర్శించింది. మెడికల్ బోర్డును రద్దు చేసి గతంలో అమలు చేసిన విధానంలోనే రీ-మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేసింది.

**హాజరైన వారందరినీ అన్‌ఫిట్ చేయాలనే డిమాండ్ సాధ్యమేనా?**

ఏఐటీయూసీ నాయకులు మెడికల్ బోర్డుకు వచ్చిన కార్మికులందరినీ అన్‌ఫిట్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే ఈ డిమాండ్‌పై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మెడికల్ బోర్డు అనేది పూర్తిగా వైద్య నిపుణుల పరీక్షలు, ఆరోగ్య పరిస్థితి ఆధారంగా తీసుకునే నిర్ణయం. బోర్డుకు వచ్చిన ప్రతి ఒక్కరినీ నూటికి నూరు శాతం అన్‌ఫిట్‌గా ప్రకటించడం వైద్యపరంగా, నిబంధనల పరంగా సాధ్యమా అనే ప్రశ్నలు కూడా ఉత్పన్నమవుతున్నాయి. అదే సమయంలో నిజంగా తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్న అర్హులైన కార్మికులకు మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ అన్యాయం జరగకూడదని కార్మిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

**దళారులపై ఆరోపణలు... నిజానిజాలు తేలాల్సిందే**

ప్రతి మెడికల్ బోర్డు సమయంలో దళారుల జోక్యం, లక్షల రూపాయల లావాదేవీలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఎన్నో సంవత్సరాలుగా వినిపిస్తున్నాయి. కొందరు దళారులు కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టారనే విమర్శలు కూడా ఉన్నాయి. అయితే వీటిలో ఎంతవరకు నిజం ఉందనే అంశంపై ఇప్పటివరకు స్పష్టమైన విచారణ జరగలేదు. అందుకే ఈ ఆరోపణలపై ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం విజిలెన్స్ ద్వారా సమగ్ర విచారణ జరిపించాలని కార్మికులు కోరుతున్నారు.

**భట్టి ప్రకటన... రేవంత్ హామీ**

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క గతంలో మెడికల్ బోర్డులపై విజిలెన్స్ విచారణ జరిపిస్తామని ప్రకటించగా, ఆ తర్వాత కొంతకాలం బోర్డులు నిలిచిపోయాయి. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భూపాలపల్లి సభలో అర్హులైన కార్మికులకు అన్యాయం జరగదని, మెడికల్ బోర్డు కొనసాగుతుందని ప్రకటించడంతో కార్మికుల్లో ఆశలు చిగురించాయి.

**హెచ్ఎంఎస్ ఏమంటోంది?**

హెచ్ఎంఎస్ ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ, ఐఏఎస్, ఐపీఎస్ వంటి జాతీయ స్థాయి పరీక్షలకు కూడా కనీసం 15 రోజుల ముందుగానే సమాచారం ఇస్తారని, కానీ సింగరేణి మెడికల్ బోర్డుకు మాత్రం ఒక్కరోజు ముందు సమాచారం ఇవ్వడం నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. సమాచారం ఆలస్యంగా అందడం వల్లే 28 మంది కార్మికులు హాజరు కాలేకపోయారని తెలిపారు. గైర్హాజరైన వారికి ప్రత్యేక మెడికల్ బోర్డు నిర్వహించి మరో అవకాశం ఇవ్వాలని, అర్హులైన ఏ ఒక్క కార్మికుడికీ అన్యాయం జరగకుండా యాజమాన్యం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**ఏఐటీయూసీ ఆరోపణలు**

ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య మాట్లాడుతూ, ఈసారి నిర్వహించిన మెడికల్ బోర్డు బూటకపు ప్రక్రియగా జరిగిందని ఆరోపించారు. గతంలో అమలు చేసిన విధానంలోనే రీ-మెడికల్ బోర్డు నిర్వహించాలని, రెండేళ్ల కాలపరిమితి నిబంధన తొలగించాలని, నెలకు రెండు సార్లు మెడికల్ బోర్డు నిర్వహించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు న్యాయం జరగకపోతే సింగరేణి వ్యాప్తంగా ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

**పారదర్శకతే శాశ్వత పరిష్కారం**

మెడికల్ బోర్డు విషయంలో కార్మిక సంఘాల ఆరోపణలు, యాజమాన్యం వివరణలు, దళారులపై వస్తున్న విమర్శలు, వైద్య ప్రమాణాలపై నెలకొన్న సందేహాలన్నింటికీ ఒకే పరిష్కారం పూర్తి పారదర్శకత. అర్హులైన కార్మికులకు న్యాయం జరిగేలా, అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం స్వతంత్ర విజిలెన్స్ విచారణ జరిపిస్తేనే ఈ వివాదాలకు శాశ్వత ముగింపు లభించే అవకాశం ఉందని కార్మిక వర్గాలు, పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుతం ఈ అంశం సింగరేణి కార్మికుల్లోనే కాకుండా రాజకీయ, కార్మిక వర్గాల్లో కూడా విస్తృత చర్చకు దారితీసింది.

## గూడెం గుట్టలో శ్రీ సత్యనారాయణ స్వామికి కేటీఆర్ ప్రత్యేక పూజలు



**దండేపల్లి, జులై 21(ప్రజాజ్యోతి )**మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని గూడెం గుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయాన్ని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సందర్శించారు. ఆలయానికి చేరుకున్న కేటీఆర్‌కు ఆలయ అర్చకులు, ఆలయ అధికారులు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం శ్రీ సత్యనారాయణ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అర్చకులు స్వామివారి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందించి శేషవస్త్రంతో కేటీఆర్‌ను సత్కరించారు. కేటీఆర్ దర్శనానికి పెద్ద సంఖ్యలో భక్తులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు.

## ఎస్టిపిపిలో మెగా ప్లాంటేషన్

**పర్యావరణ పరిరక్షణకు సింగరేణి కట్టుబాటు**



**జైపూర్, జులై 21: ప్రజా జ్యోతి** జైపూర్ మండలంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టిపిపి)లో మంగళవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బొగ్గు మంత్రిత్వ శాఖ, కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ ఆదేశాల మేరకు, సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ప్లానింగ్) కె. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ ఉత్పత్తి ద్వారా దేశ, రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా దోహదపడుతోందన్నారు. బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రతి ఏడాది విస్తృత స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కల పెంపకం కీలకమని పేర్కొన్నారు. అనంతరం డైరెక్టర్‌తో పాటు ప్లాంటు అధికారులు, ఉద్యోగులు ఎస్టిపిపి ఆవరణలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్లాంటు ఈడీ సీహెచ్ చిరంజీవి, జీఎం ఎం. నరసింహారావు, జీఎం (పీసీఎస్) మదన్ మోహన్, ఏజీఎం (ఈ ఎం) సూర్యనారాయణ రాజు, ఏజీఎం (ఓ.ఎం) వీవీ సుధాకర్ రెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) బి. శ్రీధర్, ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి సత్యనారాయణ, సీఎంఓఏఐ బ్రాంచ్ అధ్యక్షుడు డి. పంతుల, 1.800 మెగావాట్ల ప్లాంట్ కోఆర్డినేటర్ ఎం.వి. వేణుగోపాల్, డీజీఎం (ఎన్విరాన్‌మెంట్) వాసుదేవమూర్తి, పర్సనల్ విభాగాధిపతి ఎస్.వి. రాజేశ్వర్ రావు, ఫారెస్ట్ మేనేజర్ చంద్రమణి తదితర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన విద్య, మెరుగైన వసతులు కల్పించాలి

**అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య**

**కస్తూరిబా విద్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ**

**విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యత పరిశీలన**

**నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు**



**మంచిర్యాల, 21, జులై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లాలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా పౌష్టికాహారం, పరిశుభ్రమైన వసతులు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య సూచించారు.

మంగళవారం హాజీపూర్ మండలం కర్ణమామిడి, లక్షెట్టిపేట, దండేపల్లి మండలం కర్ణపేట గ్రామాల్లోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలల పరిసరాల పరిశుభ్రత, తరగతి గదులు, వసతి గృహాలు, భోజనశాల, వంటశాల, త్రాగునీటి సదుపాయాలు, విద్యార్థినులకు అందిస్తున్న భోజన నాణ్యత, బోధన విధానం, హాజరు రిజిస్టర్లు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి బోధన, హాస్టల్ వసతులు, ఆహార నాణ్యత, ఇతర సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి అందిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల బలోపేతానికి ప్రాధాన్యత ఇస్తోందని, విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచడంతో పాటు విద్యార్థుల సంఖ్య పెరిగేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. పాఠశాలల్లో నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు, స్కూల్ కాంప్లెక్స్ తదితర పనులను వేగంగా పూర్తి చేసి త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని పాఠశాలలు, వసతి గృహాలు, గ్రామాల్లో పరిశుభ్రతను కట్టుదిట్టంగా నిర్వహించాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. త్రాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు లేకుండా చూసి, క్లోరినేషన్ చేసిన సురక్షిత నీటిని విద్యార్థులు, ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. హాజీపూర్ మండలం కర్ణమామిడి గ్రామపంచాయతీని సందర్శించిన అదనపు కలెక్టర్ గ్రామంలో మురుగు కాలువల నిర్వహణ, పారిశుధ్య పనులను సక్రమంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వర్షాకాలంలో కూలిపోయే ప్రమాదంలో ఉన్న శిథిలావస్థ ఇళ్లను గుర్తించి, అవసరమైతే ఆయా కుటుంబాలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలించేలా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల పరిసరాల్లో వీధిదీపాలు పనిచేయడం లేదని గుర్తించిన ఆయన, విద్యుత్ శాఖ అధికారిని వెంటనే పిలిపించి మరమ్మతులు పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా మున్సిపల్ కమిషనర్ అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో మండల పంచాయతీ అధికారి సుమన్, మండల విద్యాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, ప్రత్యేక అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, విద్యుత్ శాఖ అధికారులు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు

**ప్రతి నెల రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించాలి**

**రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్**



**మంచిర్యాల, 21, జులై (ప్రజాజ్యోతి):** రాష్ట్రంలోని జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు అన్ని జిల్లాల్లో సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని రాష్ట్ర రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయం నుంచి అదనపు కార్యదర్శి ఇలంబర్తి, శాంతిభద్రతలు, రవాణా, రహదారులు-భవనాలు, జాతీయ రహదారుల శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస్ రాజ్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు జాతీయ రహదారులపై ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి నెల జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశాలు నిర్వహించాలని, ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ప్రమాదాలకు గురయ్యే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి అక్కడ తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతో పాటు అంబులెన్స్ సేవలను ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రుల ను సమీప ఆసుపత్రులకు తరలించి అత్యవసర వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్ట్‌లు, హెల్మెట్లు ధరించేలా కట్టుదిట్టమైన చర్యలు అమలు చేయాలన్నారు. ఇందులో పాల్గొన్న మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, మంచిర్యాల జిల్లాలో జాతీయ రహదారులపై ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. రహదారి భద్రత కమిటీ సమావేశాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తూ, ప్రమాదాలు ఎక్కువగా జరిగే బ్లాక్‌స్పాట్‌లను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీసీపీ ఎ. భాస్కర్‌తో పాటు రవాణా, రహదారులు-భవనాలు, జాతీయ రహదారుల శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత సహాయకుడు పూదారి అరవింద్ కుమార్‌కు ఘనంగా జన్మదిన వేడుకలు



**సారంగాపూర్, జులై 21:ప్రజా జ్యోతి** నిర్మల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కుచాడి శ్రీహరి రావు వ్యక్తిగత సహాయకుడు పూదారి అరవింద్ కుమార్ జన్మదిన వేడుకలు మండల కేంద్రం లో ఘనంగా నిర్వహించారు. సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ అబ్దుల్ ఆది, సర్పంచ్ కూనేరు భూమన్న ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు కలిసి అరవింద్ కుమార్‌కు శాలువా కప్పి, గజమాలలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలకు మరింత సేవ చేయాలని, ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో దీర్ఘాయుష్షు కలగాలని నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సోషల్ మీడియా కోఆర్డినేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణపై సమీక్ష.. 99 శాతం పూర్తి చేసిన బీఎల్‌ఏకు సన్మానం



**ఆసిఫాబాద్ జులై 21 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ నియోజకవర్గంలోని వాంకిడి మండలంలో ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి అజ్మీరా శ్యామ్ నాయక్ బూత్ స్థాయి ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు అయ్యేలా బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ప్రత్యేక సమగ్ర సవరణపై అవగాహన కల్పించి, అవసరమైన ధ్రువపత్రాల సమర్పణలో సహకరించాలని కోరారు. సమావేశంలో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై చర్చించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పారదర్శకంగా, నిర్ణీత గడువులోగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో 99 శాతం పనిని పూర్తి చేసిన బూత్ స్థాయి ప్రతినిధి తిరుపతిని ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్నులే నారాయణ, యువజన అధ్యక్షులు క్రిష్ణ బంబర సర్పంచ్ కృష్ణజీ, వాంకిడి సర్పంచ్ మాడవి భీమారావు, మాజీ మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు కె. కిషన్, కనర్ గాం సర్పంచ్ కోట్నాక్ భీమారావు, బీసీ అధ్యక్షుడు గణేష్, వార్డు సభ్యుడు పాండు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, పర్యవేక్షకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వాంకిడి--కాగజ్‌నగర్, గుండి బ్రిడ్జిల పూర్తి కోసం సీఎంకు వినతి

సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి.. పనులు పూర్తి చేస్తామని దుర్గం జీవన్‌కు హామీ



**ఆసిఫాబాద్ జులై 21 ప్రజా జ్యోతి** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో కనర్‌గాం ఉపసర్పంచ్, మాజీ ఆసిఫాబాద్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం జీవన్ సోమవారం ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి నుంచి కాగజ్‌నగర్‌కు వెళ్లే బ్రిడ్జితో పాటు గుండి బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ రెండు బ్రిడ్జిల నిర్మాణం ఆలస్యం కావడంతో స్థానిక ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దుర్గం జీవన్ ముఖ్యమంత్రికి వివరించారు. ప్రజల రాకపోకలకు ఈ బ్రిడ్జిలు అత్యంత కీలకమని, నిర్మాణాన్ని వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.వినతిని పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించి, వాంకిడి--కాగజ్‌నగర్ బ్రిడ్జితో పాటు గుండి బ్రిడ్జి నిర్మాణ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు దుర్గం జీవన్ తెలిపారు. దీంతో త్వరలోనే ఈ బ్రిడ్జిల నిర్మాణం పూర్తై ప్రజల ఇబ్బందులు తొలగుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు

# డిజిటల్ దర్యాప్తు, విజిబుల్ పోలీసింగ్‌తో నేరాల నియంత్రణకు చర్యలు

### మంచిర్యాల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ భాస్కర్

**మంచిర్యాల, 21, జులై (ప్రజాజ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంచిర్యాల జోన్ డీసీపీ ఎ. భాస్కర్ మంగళవారం సందర్శించి స్టేషన్ పనితీరును సమగ్రంగా సమీక్షించారు. ముందుగా పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరును పరిశీలించిన ఆయన, అనంతరం రిసెప్షన్, స్టేషన్ రికార్డులను తనిఖీ చేసి సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకోవడంతో పాటు, స్టేషన్ పరిధిలో అధికంగా నమోదవుతున్న నేరాల స్వరూపం, రౌడీ షీటర్ల వివరాలు, అనుమానితుల ప్రస్తుత పరిస్థితులపై సమీక్ష నిర్వహించారు. బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ సిబ్బంది పనితీరు, విధుల నిర్వహణ సమయాలను కూడా పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర డీజీపీ ఆదేశాల మేరకు ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్ లో సకాలంలో నమోదు చేయాలని, కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను డిజిటల్ రూపంలో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. వీడియో ఆధారిత దర్యాప్తుకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, సంఘటన స్థలాల వీడియో చిత్రీకరణ, సాక్షుల వాంగ్మూలాల వీడియో రికార్డింగ్ వంటి ఆధారాలు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేందుకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ప్రతి స్టేషన్ అధికారి తప్పనిసరిగా రౌడీ షీటర్ల నివాసాలను సందర్శించి వారి ప్రస్తుత పరిస్థితులను ప్రత్యక్షంగా తెలుసుకోవాలని సూచించిన డీసీపీ, గంజాయి సహా ఇతర మత్తు పదార్థాల



క్రయవిక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచి వాటి నిర్మూలనకు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్ అత్యంత కీలకమని పేర్కొంటూ, నిరంతర పెట్రోలింగ్‌తో పాటు ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహించాలని సూచించారు. మంచిర్యాల పట్టణం వ్యాపార కేంద్రంగా, రైల్వే అనుసంధానం కలిగిన ప్రాంతంగా ఉన్నందున ఆస్తి సంబంధిత నేరాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని, బీట్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని డీసీపీ అధికారులకు సూచించారు. బంగారు దుకాణాలు, బ్యాంకులు, ఏటీఎంలు, ఇతర ఆర్థిక సంస్థల వద్ద పగలు, రాత్రి వేళల్లో ఆయుధాలతో ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలు, వ్యాపార సంస్థల యజమానులు తప్పనిసరిగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, కాలనీలు, జనసాంద్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో కమ్యూనిటీ సీసీటీవీ కెమెరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. డిజిటల్ సాంకేతికత వినియోగం, సమర్థవంతమైన దర్యాప్తు, ప్రజల సహకారం, నిరంతర పెట్రోలింగ్ ద్వారా నేరాలను సమర్థంగా నియంత్రించి ప్రజలకు మరింత భద్రత కల్పించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని డీసీపీ ఎ. భాస్కర్ స్పష్టం చేశారు.

# మారుమూల గ్రామాల్లోని ప్రజలకు ఎలాంటి సమస్యలు లేకుండా చూడాలి







### త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి

### ప్రతి రైతు ఫామ్ పాండ్‌ల నిర్మాణానికి ముందుకు రావాలి

### జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా

**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జులై 21 ,( ప్రజాజ్యోతి ).** మారుమూల గ్రామాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా ఆదేశించారు.మంగళవారం కుంటాల మండలంలోని అంబుగాం గ్రామంలో పర్యటించిన కలెక్టర్ గ్రామంలోని తాగునీటి వసతి, విద్యుత్, టెలికాం సేవలు, ఇతర మౌలిక సదుపాయాలపై స్థానికులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గ్రామస్తులకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉన్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపితే వెంటనే నూతన బోరుబావి మంజూరు చేస్తామని తెలిపారు. బోరుబావి ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని, ట్రాన్స్‌ఫార్మర్‌ను పరిశీలించి అవసరమైన చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.భూగర్భ జలాల సంరక్షణకు ఫామ్ పాండ్‌లు అత్యంత ఉపయోగకరమని పేర్కొన్న కలెక్టర్, ప్రతి రైతు తన వ్యవసాయ క్షేత్రంలో ఫామ్ పాండ్ నిర్మించుకోవాలని పిలుపునిచ్చారు. గ్రామంలోని రైతు ఏర్పాటు చేసిన ఫామ్ పాండ్‌ను పరిశీలించి, ఇప్పటికే ఏర్పాటు చేసుకున్న రైతులతో పాటు కొత్తగా ముందుకు వస్తున్న రైతులను అభినందించారు. గ్రామంలో మరిన్ని ఫామ్ పాండ్‌లు ఏర్పాటయ్యేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.అలాగే గ్రామంలో టెలికాం సేవల మెరుగుదలకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భూగర్భ జలాల పరిరక్షణలో ప్రతి గ్రామస్థుడు భాగస్వామి కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.ఈ పర్యటనలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, డీపీఓ శ్రీనివాస్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, ఈఈ ఆర్‌డబ్ల్యూఎస్ సందీప్, తహసీల్దార్ కమల్ సింగ్, ఎంపీడీఓ వనజ, సర్పంచ్ శివాజీ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# దంచికొడుతున్న వానలు..
# సింగరేణి ఓపెన్‌కాస్ట్ గనుల్లో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్.....

మంచిర్యాల జిల్లాలో భారీ వర్షాల ప్రభావం
రోజుకు నిలిచిపోయిన 35 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి
ఓబీ పనులకూ అంతరాయం
కోట్ల రూపాయల నష్టం చవిచూస్తున్న సింగరేణి

**మంచిర్యాల, 21, జూలై (ప్రజాజ్యోతి):** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా గత రెండు, మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా సింగరేణి సంస్థలోని ఓపెన్‌కాస్ట్ (ఉపరితల) బొగ్గు గనుల్లో బొగ్గు ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. జిల్లాలోని బెల్లంపల్లి రీజియన్ పరిధిలో ఉన్న మంచిర్యాల, మందమర్రి, గోలేటి (బెల్లంపల్లి డివిజన్) ఓపెన్‌కాస్ట్ గనుల్లో భారీగా వర్షపు నీరు చేరడంతో పనులు నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గనుల్లో నీరు నిలిచిపోవడంతో భారీ యంత్రాలు కదలలేని పరిస్థితి నెలకొంది. పంపులు ఏర్పాటు చేసినా ఫలితం లేకుండా పోయింది. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గనుల్లో చేరే నీటిని బయటకు పంపించేందుకు సింగరేణి యాజమాన్యం ముందస్తుగానే భారీ సామర్థ్యం గల పంపులను ఏర్పాటు చేసింది. అయినప్పటికీ కురుస్తున్న భారీ వర్షాలకు వాటి సామర్థ్యాన్ని మించి నీరు గనుల్లోకి చేరుతుండటంతో బొగ్గు ఉత్పత్తిని నిలిపివేయక తప్పలేదు. నీటి మట్టం పెరగడంతో బొగ్గు తవ్వకాలు పూర్తిగా స్తంభించాయి. బొగ్గు ఉత్పత్తితో పాటు ఓబీ పనులు కూడా నిలిచిపోయాయి. బొగ్గు ఉత్పత్తితో పాటు ఓవర్‌బర్డెన్ (ఓబీ) పనులు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. బొగ్గు పొరపై ఉన్న మట్టిని తొలగించే ప్రక్రియను ఓబీ పనులు అంటారు. ఈ పనులు ఆగిపోవడంతో భవిష్యత్‌లో కూడా బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**రోజుకు 35 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి అంతరాయం.....**

భారీ వర్షాల కారణంగా రోజుకు సుమారు 35 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయినట్లు అధికారులు అంచనా వేశారు. అలాగే దాదాపు 1.85 లక్షల క్యూబిక్ మీటర్ల ఓవర్‌బర్డెన్ (ఓబీ) పనులు కూడా నిలిచిపోయినట్లు తెలిపారు. దీంతో సంస్థకు భారీ ఉత్పత్తి నష్టం వాటిల్లుతోంది.

**భారీ యంత్రాల నిర్వహణ కష్టంగా మారింది....**

గనుల్లో భారీగా నీరు నిలిచిపోవడంతో బొగ్గు ఉత్పత్తికి వినియోగించే డంపర్లు, షవెల్స్, ఎక్స్‌కవేటర్లు వంటి భారీ యంత్రాల నిర్వహణ కష్టతరంగా మారిందని అధికారులు తెలిపారు. యంత్రాలు పనిచేయలేని పరిస్థితి ఏర్పడటంతో బొగ్గు తవ్వకాలతో పాటు రవాణా కార్యకలాపాలు కూడా పూర్తిగా దెబ్బతిన్నాయి. సింగరేణికి గుండెకాయలాంటి ఓపెన్‌కాస్ట్ గనులు. సింగరేణి సంస్థకు ఓపెన్‌కాస్ట్ గనులే గుండెకాయ వంటివి. సంస్థలో అత్యధిక బొగ్గు ఉత్పత్తి ఈ గనుల నుంచే జరుగుతుంది. అందువల్ల ఈ గనుల్లో ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల సంస్థకు కోట్ల రూపాయల మేర నష్టం వాటిల్లుతోంది. బొగ్గు రవాణా కూడా తీవ్రంగా ప్రభావితమవడంతో




విద్యుత్ కేంద్రాలకు సరఫరాపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. వర్షాలు తగ్గిన తర్వాతే ఉత్పత్తి పునఃప్రారంభం కానున్నాయి .వర్షాలు తగ్గి గనుల్లో నిలిచిన నీటిని పూర్తిగా తొలగించిన తర్వాత పరిస్థితిని సమీక్షించి, దశలవారీగా బొగ్గు ఉత్పత్తిని పునఃప్రారంభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

**ఇప్పటికే లక్ష్యాల సాధనలో వెనుకబడుతున్న సింగరేణి**

సింగరేణి సంస్థలో ఏప్రిల్ నుంచి మార్చి వరకు ఆర్థిక సంవత్సరంగా పరిగణిస్తారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంస్థ మొత్తం 64.30 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే ఇప్పటికే పలు కారణాలతో ఓపెన్‌కాస్ట్ గనుల్లో అనుకున్న స్థాయిలో బొగ్గు ఉత్పత్తి జరగడం లేదు. ముఖ్యంగా ఓబీ పనులు ఆశించిన వేగంతో సాగకపోవడం వల్ల వార్షిక లక్ష్య సాధనపై ప్రభావం పడుతోంది.తాజాగా పడుతున్న వర్షాలు కూడా తోడు కావడం తో బొగ్గు ఉత్పత్తి పై సింగరేణి దిబ్బ పడుతున్నది . సింగరేణి మొత్తం లో గత నెలలో 36.05 లక్షల టన్నుల ఉత్పత్తి లక్ష్యం ఉండగా, 32.63 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే నమోదై, సుమారు 91 శాతం లక్ష్యం సాధ్యమైంది. అదేవిధంగా రామగుండం-1, రామగుండం-2, రామగుండం-3, అడ్రియాల ప్రాజెక్టు, భూపాలపల్లి ప్రాంతాల్లో 14.70 లక్షల టన్నుల లక్ష్యం ఉండగా, 7.724 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి మాత్రమే జరిగి 53 శాతం లక్ష్యం మాత్రమే సాధ్యమైనట్లు సింగరేణి యాజమాన్యం తన నివేదికలో వెల్లడించింది.

**తాజా వర్షాలతో కోట్ల రూపాయల నష్టం..**

ఇప్పటికే అనుకున్న టార్గెట్ కంటే తక్కువ బొగ్గు ఉత్పత్తి జరుగుతుండగా, ఇప్పుడు భారీ వర్షాల కారణంగా అధిక బొగ్గు ఉత్పత్తి జరిగే ఓపెన్‌కాస్ట్ గనుల్లో పనులు పూర్తిగా నిలిచిపోవడంతో సింగరేణి సంస్థకు కోట్ల రూపాయల మేర ఆర్థిక నష్టం వాటిల్లుతోంది. వర్షాలు కొనసాగితే ఉత్పత్తి లక్ష్యాల సాధన మరింత కష్టమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని గని అధికారులు అభిప్రాయపడుతున్నారు. దీంతో ఈ వర్షాకాలం సింగరేణి సంస్థకు మరో పెద్ద సవాల్‌గా మారింది.

## ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన బీఆర్ఎస్ నాయకులు



**సారంగాపూర్, జూలై 21:**(ప్రజా జ్యోతి భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (2026)లో భాగంగా మండలంలోని అడెల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు.ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు) చేపడుతున్న ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఓటరు జాబితా సవరణ ప్రక్రియ పారదర్శకంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని పంచాయతీ కార్యదర్శి ని కోరారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాజీ సర్పంచ్ దేవి శంకర్, మోతేవర్ లక్ష్మణ్, భామనపల్లి గణేష్, సతీష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలి

రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి





**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూలై 21 ,( ప్రజాజ్యోతి )** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) డిజిటలైజేషన్ ప్రక్రియలో వేగం పెంచాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ఎస్ఐఆర్ ప్రక్రియ మీద రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, మంగళవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ లో వెనుకబడి ఉన్న జిల్లాలలో ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లాల వారిగా ఎస్ఐఆర్ డిజిటలైజేషన్ ప్రగతి వివరాలు సమీక్షించారు. వారంలోగా అన్ని జిల్లాల ఎస్ఐఆర్ ప్రక్రియ 90 శాతానికి చేరుకోవాలని, వీలైనంత త్వరగా ప్రక్రియ మొత్తాన్ని పూర్తి చేయాలని చెప్పారు. ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారములో ఆధార్ నంబరు నమోదు చేయడం కేవలం ఐచ్ఛిక మాత్రమే అని, తప్పనిసరి కాదని వివరించారు. కలెక్టర్లంతా ప్రక్రియ పూర్తయ్యే వరకు పర్యవేక్షణ ఉంచాలని చెప్పారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ భవేశ్ మిశ్రా, అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్ ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీలలో నిరంతరం పారిశుద్ధ్య పనులు కొనసాగించాలి

వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలి
పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జూలై 21 ,( ప్రజాజ్యోతి ).**జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల్లో పారిశుధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, కలెక్టర్ మున్సిపాలిటీకి సంబంధించిన అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో నిరంతరం మెరుగైన పారిశుద్ధ్య పనులు కొనసాగించాలని అన్నారు. వర్షాకాలం ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాల మేరకు ఘన వ్యర్థాల నిర్వహణ సక్రమంగా చేపట్టాలని తెలిపారు. ప్లాస్టిక్ నిషేధం పకడ్బందీగా అమలు చేయాలని అన్నారు. మౌలిక సదుపాయాల కల్పన పనులన్నీ వేగవంతంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ లు రవి బాబు, సుందర్ సింగ్, యాదయ్య, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కొయ గోండి గిరిజన భాషా దినోత్సవం





**మాతృభాష పట్ల మమకారం ఉండాలి**

**ఎమ్మెల్యే వెడమబొజ్జు పటేల్**

**ఖానాపూర్ జూలై 21 (ప్రజా జ్యోతి )** ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ ఐటీడీఏ పరిధిలోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీలో కొయ గోండి గిరిజన భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ముఖ్య అతిథిగా విచ్చేసి, గిరిజన భాషలు, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మన మాతృభాష మన గౌరవం... గిరిజన భాషల పరిరక్షణే మన సంస్కృతి పరిరక్షణకు బలమైన పునాది అని వెడ్మ బొజ్జు పటేల్ కొనియాడారు.. ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి మందా మకరందు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గిరిజన ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మేధావులు, గిరిజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కొయ--గోండి భాషల పరిరక్షణకు తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

# బాసర ఆలయానికి రూ.1 లక్షకు పైగా ఆదాయం





**బాసర, జూలై 21 (ప్రజా జ్యోతి)**బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం భక్తులు సమర్పించిన ఒడి బియ్యం హుండీలను ఆలయ అధికారులు విప్పారు. ఈ సందర్భంగా లభించిన కానుకలతో పాటు 48 క్వింటాళ్ల ఒడి బియ్యం ద్వారా ఆలయానికి రూ.1,00,379 ఆదాయం సమకూరింది. హుండీల ద్వారా వచ్చిన కానుకల విలువ రూ.7,308 కాగా, 50 కిలోల చొప్పున 97 సంచుల్లో మొత్తం 48 క్వింటాళ్ల ఒడి బియ్యం లభించింది. ఈ బియ్యం విలువ రూ.93,071గా అంచనా వేయగా, మొత్తం కలిపి ఆలయానికి రూ.1,00,379 ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. ఆలయ ఈఓ అనుమతితో నిర్వహించిన హుండీల విప్పట కార్యక్రమాన్ని ఏఈఓ గంగా శ్రీనివాస్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆలయ పర్యవేక్షకులు సంజీవ్‌రావు, శివరాజ్, ఆలయ సిబ్బంది, వాగ్దేవి లేబర్ సొసైటీ సభ్యులు, హోంగార్డులు పాల్గొన్నారు.

## ఎం. మదన్ మోహన్ సేవలు సింగరేణికి ఆదర్శం

**పదవీ విరమణ సందర్భంగా ఘన సన్మానం చేసిన తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య వ్యవస్థాపక కన్వీనర్ కేంగర్ల మల్లన్న**



**మంచిర్యాల, 21, జూలై ( ప్రజా జ్యోతి :** మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్‌టీపీపీ)లో జనరల్ మేనేజర్ (ఈ అండ్ ఎం)గా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఎం. మదన్ మోహన్ ను తెలంగాణ బొగ్గుగని కార్మిక సమాఖ్య వ్యవస్థాపక కన్వీనర్ కేంగర్ల మల్లన్న ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కేంగర్ల మల్లన్న మాట్లాడుతూ, మదన్ మోహన్ తన ఉద్యోగ జీవితమంతా నిబద్ధత, క్రమశిక్షణ, పారదర్శకతతో పనిచేసి సింగరేణి సంస్థ అభివృద్ధికి విశేష సేవలు అందించారని అన్నారు. సాంకేతిక నైపుణ్యంతో పాటు ఉద్యోగులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారని అన్నారు. పదవీ విరమణ అనేది ఉద్యోగ జీవితానికి ముగింపు మాత్రమేనని, సమాజానికి సేవ చేసే అవకాశాలకు ఇది నాంది అని మల్లన్న అన్నారు. భవిష్యత్ జీవితంలో మదన్ మోహన్ ఆయురారోగ్యాలతో, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఆయన అనుభవం, మార్గదర్శకత్వం యువ ఇంజినీర్లు, ఉద్యోగులకు ఎల్లప్పుడూ ఉపయోగపడాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు బండి రవి, సీహెచ్. సత్యనారాయణ రెడ్డి, దేగల శ్రీనివాస్, పర్శరాం, గజెల్లి రాజాలింగు, తాజుద్దీన్, సదానందం, బార్ల ఆనంద్ తదితరులు పాల్గొని మదన్ మోహన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో జరిగింది.

# దేశ యువతపై లాఠీచార్జ్‌కు నిరసనగా ప్రధాని నివాసం ఎదుట కాంగ్రెస్ ధర్నా

**రాహుల్ గాంధీతో కలిసి పాల్గొన్న పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**

**ఎంపీ సహా కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు**





**మంచిర్యాల, 21, జూలై ( ప్రజా జ్యోతి :** దేశ యువతపై జరిగిన లాఠీచార్జ్, టియర్ గ్యాస్ ప్రయోగాన్ని తీవ్రంగా ఖండిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నివాసం ఎదుట నిరసన ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణతో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ఎంపీలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఇటీవల తమ హక్కుల సాధన కోసం శాంతియు తంగా నిరసన చేపట్టిన విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత గొంతును బలప్రయోగంతో అణచి వేయాలనే ప్రయత్నాలను ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించ బోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తైన యువత తమ సమస్యలు, హక్కుల కోసం శాంతియుతంగా స్వరం వినిపిస్తే వారిపై లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే రాజ్యాంగ బద్ధమైన హక్కు ఉందని, ఆ హక్కును హరించే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని ఎంపీ వంశీకృష్ణ అన్నారు దేశవ్యాప్తంగా విద్యార్థులు, యువత ఆందోళనకు కారణమైన ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ గా డిమాండ్ వస్తున్నామన్నారు ఈ డిమాండ్‌తోనే ప్రధానమంత్రి నివాసం ఎదుట ధర్నా నిర్వహించినట్లు నాయకులు తెలిపారు. ధర్నా కొనసాగుతున్న సమయంలో పోలీసులు జోక్యం చేసుకుని నిరసనకారులను అక్కడి నుంచి తొలగించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీతో పాటు నిరసనలో పాల్గొన్న పలువురు కాంగ్రెస్ ఎంపీలు, నాయకులను అదుపులోకి తీసుకున్నారు. పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదుపులోకి తీసుకున్న అనంతరం వారిని ఎక్కడికి తరలించారనే విషయంపై స్పష్టత ఇవ్వలేదని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ప్రజాస్వామ్య హక్కులు, రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఎంపీ గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. దేశ యువత హక్కులను కాపాడడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని పేర్కొంటూ, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పార్టీ అన్ని స్థాయిల్లో ఉద్యమాన్ని కొనసాగిస్తుందని ఎంపీ తెలిపారు.

## ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణపై అవగాహన



**ఆసిఫాబాద్ జులై 21 ప్రజా జ్యోతి** ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా మంగళవారం వాంకిడి గ్రామపంచాయ తీ పరిధిలోని 294, 295, 296, 297 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గుర్నులే నారాయణ మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకోవాల ని, వివరాల్లో ఏవైనా తప్పులు ఉంటే సవరించుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై అవగాహన కల్పిస్తూ అవసరమైన దరఖాస్తుల సమర్పణలో సహకరించారు. ఈ కార్యక్రమంలో బూత్ స్థాయి ప్రతినిధులు, బూత్ స్థాయి అధికారులు, మాజీ ఉపసర్పంచ్ పేంటు, చునార్కర్ శివాజీ, మారుతి, శశికళతో పాటు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ సుదర్శన తిరునక్షత్రం

**కోటి సూర్యుల తేజస్సుతో ప్రకాశించేదే సుదర్శన చక్రం**

**శ్రీ నివాసుని కుడిచేతిలో ఉంటూ సృష్టిని రక్షించే ఆయుధం సుదర్శన చక్రం**

**ఒద్దిపర్తి వెంకటరమణా చార్యులు**



**నిర్మల్ జిల్లా ప్రతినిధి ,జులై 21 ,( ప్రజాజ్యోతి ).**సుదర్శన తిరునక్షత్రం ( జయంతి ) సందర్భంగా జిల్లాలోని పలు శ్రీ వైష్ణవ ఆలయాలలో సుదర్శ న తిరునక్షత్ర ఉత్సవాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ త్రిదండి శ్రీ మన్నారాయణ రామానుజ చిన్న జీయర్ స్వామి శిష్యులు ఒద్దిపర్తి వెంకటరమణా చార్యులు సుదర్శన భగవానుని విశిష్టత గూర్చి ప్రజాజ్యోతితో మాట్లాడుతూశ్రీ మహా విష్ణువుకు అనేక ఆయుధాలు ఉన్నప్పటికీ చక్రాయుధం ఒక ప్రత్యేక స్థానం ఉన్నదని అన్నారు. సుదర్శన చక్రము గురించి పురాణాలలో గల పలు సంఘటనలు గురించి తెలిపారు. ఒకటి అంబరీషుడిని అకారణంగా శపించిన దుర్వాస మహర్షిని తరుముతూ చివరకు దుర్వాసుడు అంబరీషుడిని శరణు వేడాక శాంతిస్తుందని ఇది కార్తీక పురాణంలో ద్వాదశి వ్రతకథ లో వచ్చే ఘట్టమని తెలిపారు. అలాగే మరొకటి గజేంద్ర మోక్షములో మొసలిని సంహరించేందుకు విష్ణువు ప్రయోగించిన ఆయుధం అనీ, ఇక మూడవది శిశుపాలుడ్ని సంహరించేందుకు కృష్ణుడు సుదర్శన చక్రాన్ని ప్రయోగిస్తాడని ఇలా సుదర్శనానికి సంబంధించి వివిధ పురాణాలలో చాలా గాథలున్నాయని ఆయన వివరించారు. అంతేకాకుండా కృష్ణావతారానికి పూర్వమే సుదర్శనం విష్ణువు దగ్గర ఉందని విష్ణువు దుష్టసంహారణార్థం సుదర్శనాన్ని కృష్ణావ తారానికి ముందు కూడా ప్రయోగించినట్లు పురాణగాథల వల్ల తెలుస్తోందని తెలిపారు.సుదర్శనశక్తి అద్భుతమైనదనీ.ఇది శత్రువులను అగ్నివలె దహిస్తుందనీ. శత్రుసంహారం కోసం విష్ణువు ఎప్పుడైతే సుదర్శనాన్ని ప్రయోగిస్తాడో, అప్పుడు అది సూర్య తేజో విరాజితమవుతుందని శత్రుసంహారం చేసి తిరుతుందని తెలియచేశారు. శ్రీవైష్ణవ సంప్రదాయంవారు సుదర్శనాన్ని చక్రత్తాళ్వార్ అని కూడా పిలుస్తారు. బ్రహ్మోత్సవాల ముగింపునాడు జరిగే చక్రస్నానం లేదా అవభృతస్నానం చక్రత్తాళ్వార్ కే చేస్తారని రమణా చార్యులు వివరించారు.

# సాదా బైనమా, భూభారతి దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం వద్దు: కలెక్టర్ హరిత



**ఆసిఫాబాద్ జులై 21 ప్రజా జ్యోతి** సాదా బైనమా, భూభారతి, రెవెన్యూ సదస్సుల్లో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కేంద్రం లోని సమీకృత జిల్లా కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణుతో కలిసి ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ రాజస్వ మండల అధికారులు, తహసీల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూభారతి కింద వచ్చే దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సూచించారు. సాదా బైనమాల క్రమబద్ధీకరణకు వచ్చిన దరఖాస్తుల ను రికార్డులతో సరిపోల్చి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులు పలుమండలా ల్లో ఇంకా పెండింగ్‌లో ఉన్నాయని, తిరస్కరించే దరఖాస్తులకు స్పష్టమైన కారణాలను నమోదు చేయాలని చెప్పారు. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఈ నెల 25లోగా ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ పూర్తి చేయాలని, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీ కరణతో పాటు అనుమానాస్పద ఓటర్ల జాబితా సిద్ధం చేయాలని ఆదేశించారు. సమావేశంలో రాజస్వ మండల అధికారులు లోకేశ్వర్‌రావు, చెన్నూరి కిష్టయ్య, ఎన్నికల విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా భాగవత సప్తాహ వేడుకలు శ్రీకృష్ణ జననం



**తాండూర్ జులై 21 ప్రజాజ్యోతి** భాగవత సప్తాహ వేడుకలలో భాగంగా శ్రీకృష్ణ జనన ఘట్టాన్ని భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో, కన్నులపండువగా జరుపుకున్నారు. తాండూర్ మండలంలోని అచలాపూర్ గ్రామంలో ఈనెల 17 శుక్రవారం రోజు నుంచి ఈనెల 24 వరకు నిర్వహించే భాగవత సప్తాహ వేడుకల్లో భాగంగా మంగళవారం శ్రీకృష్ణ జనన సందర్భంగా వేడుకొలను ఘనంగా నిర్వహించారు. ఆదిలాబాద్ కు చెందిన ఫణతుల మేకరాజ్ శర్మ చెప్పబడుతున్న భాగవత సప్తాహ వేడుకల్లో చెరసాలలో దేవకీ వసుదేవులకు శ్రీకృష్ణ పరమాత్ముడు అర్ధరాత్రి జన్మించిన వృత్తాంతాన్ని ప్రవచకులు వివరించగా, గోకులంలో నందయశోదల ఆనందాన్ని కీర్తిస్తూ భక్తులు నృత్యాలు, భజనలతో మార్మోగించారు.

**వేడుకల విశేషాలు**

**ప్రవచనాలు:** శ్రీమద్భాగవతంలోని దశమ స్కంధం ఆధారంగా కృష్ణ జన్మలీలలను వివరించడం.

**కీర్తనలు:** అర్ధరాత్రి వేళ ప్రత్యేక పూజలు, హారతులు మరియు నామసంకీర్తనలు.

**సామూహిక ఆనందం:** ఉట్టి కొట్టడం, పాలు-పెరుగుతో వేడుకలు జరుపుకోవడం.

# రిమ్స్ ఆసుపత్రిలో మరింత మెరుగైన వైద్యసేవలు

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21,( ప్రజా జ్యోతి)**రిమ్స్‌లో వైద్య సేవలు మ రింత మెరుగు పడాలని కలె క్టర్ రాజర్షిషా అన్నారు. మం గళవారం రిమ్స్ ఆస్పత్రిలోని డైరెక్టర్ ఛాంబర్‌లో వివిధ విభాగాల అధిపతులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ రిమ్స్ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా వివిధ విభాగాలకు అవ సరమైన అత్యవసర వైద్య పరికరాలను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ స మావేశ నిర్ణయాలకు అనుగుణంగా, ప్రస్తుతం ఆసుప త్రిలోని వివిధ విభాగాలకు అత్యవసరంగా కావలసిన వైద్య పరికరాల తుది జాబితాను సిద్ధం చేయడం జరిగిందని వివరించారు. ప్రధా నంగా జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైన కాలజీ, యూరాలజీ, ఈఎన్‌టీ, అన స్థీషియా, ఆర్థోపెడిక్స్, డెం టల్, ఆప్తాల్మాలజీ, సైకి యాట్రీ, క్యాజువాల్టీ, దయా లిసిస్ విభాగాలకు అవసర మైన పరికరాలను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రతి పాదనలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. ఈ సమావే శంలో స్థానిక సంస్థల అద నపు కలెక్టర్ రాజేశ్వర్, రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాథోడ్ జైసింగ్, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ దీపక్ పుష్కర్, వివిధ విభాగాల హెచ్ ఓ డీ లు, సిబ్బంది, తదితరులు పాల్గొ న్నారు.

## జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను సన్మానించిన నూతన ట్రెసా' కార్యవర్గం



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21, (ప్రజా జ్యోతి)**తెలంగాణ రెవెన్యూ ఎంప్లా యీస్ అసోసియేషన్ (ట్రె సా) ఎన్నికల్లో విజయం సాధించిన నూతన కార్యవర్గ ప్రతినిధులు మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షాను ఆయన క్యాంపు కార్యాల యంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలు ఎల్. రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి బి. కార్తిక్ నేతృత్వంలోని కమిటీ సభ్యులు కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం, మొక్కలు అందించి ఘనంగా సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో అసోసియేట్ అధ్యక్షులు ఎన్. విలాస్, సిద్ది అజీమ్, కోశాధికారి ఎస్. అరుణ, ఉపాధ్యక్షులు రాథోడ్ దత్తుసింగ్, కె. సాయిరాం, ఎం.కవితా రాణి ఎం డీ. అతరుద్దీన్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు అభినవ్ యాదవ్, ఎం. సౌమ్య, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాల్లో రిపోర్టర్లుగా చలామణి




**మామడ జూలై 22 (ప్రజా జ్యోతి)** సోషల్ మీడియా, యూట్యూబ్ ఛానెల్స్ విపరీతంగా పెరిగిపోవడంతో చాలామంది అనధికారికంగా రిపోర్టర్లుగా అవతరిస్తున్నారు. అసలైన పాత్రికేయుల విశ్వసనీయత దెబ్బతింటుందని, దీనిపై ఉక్కుపాదం మోపాలని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం హెచ్చరించారు.

**ఉద్యోగంలో ఉంటూ రిపోర్టర్ గా చలామణి:**
ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగులు రిపోర్టర్లుగా (జర్నలిస్టులుగా) చలామణి కావడం చట్టవిరుద్ధం. ప్రభుత్వ ఉద్యోగుల ప్రవర్తనా నియమావళి ప్రకారం, ముందస్తు అనుమతి లేకుండా ఏ ఉద్యోగి కూడా వార్తాపత్రికలు, ప్రచురణలు లేదా ఎలక్ట్రానిక్ మీడియాలో సంపాదకత్వ బాధ్యతలు లేదా నిర్వహణలో పాల్గొనరాదు.

**ప్రవర్తనా నియమావళి:** కేంద్ర, రాష్ట్ర సివిల్ సర్వీసెస్ ప్రవర్తన నియమావళి (రూల్-8) ప్రకారం, ఉద్యోగులు మీడియా సంస్థల్లో పనిచేయడానికి గానీ, రిపోర్టర్లుగా వార్తలు రాయడానికి గానీ వీల్లేదు. ఇది ద్వంద్వ ఉద్యోగం, ప్రయోజనాల సంఘర్షణ కిందకు వస్తుంది.

**భావప్రకటన స్వేచ్ఛ - పరిమితులు:** ఉద్యోగులు తమ అధికారిక విధులకు భంగం కలిగించేలా, లేదా ప్రభుత్వ విధానాలను విమర్శించేలా మీడియాలో వ్యాసాలు రాయడం లేదా వార్తలు ప్రసారం చేయడం నిషిద్ధం.

**చర్యలు:** ఈ నిబంధనలను ఉల్లంఘించినట్లు రుజువైతే, సంబంధిత శాఖ అధికారులు ఉద్యోగిపై కఠినమైన క్రమశిక్షణా చర్యలు సస్పెన్షన్ లేదా సర్వీస్ నుంచి తొలగించే అవకాశం ఉంటుంది.

**అక్రిడిటేషన్ సమస్యలు:** ప్రభుత్వ ఉద్యోగం చేస్తూ విలేకరిగా గుర్తింపు కార్డుపొందడం కూడా నిబంధనలకు విరుద్ధం.

## చౌక ధరల దుకాణాల నిర్వాహకులతో సమీక్ష సమావేశం



**సారంగాపూర్, జూలై 21:**ప్రజా జ్యోతి సారంగాపూర్ మండల తహసీల్దార్ కార్యాలయంలో చౌక ధరల దుకాణాల (రేషన్ షాపుల) నిర్వాహకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ బి. విజయకాంత్ రావు అధ్యక్షత వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రేషన్ కార్డుదారుల ఆధార్ ధ్రువీకరణ ప్రక్రియను నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలని నిర్వాహకులను ఆయన ఆదేశించారు. ఆధార్ ఈ-కేవైసీ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ వెంకట నర్సయ్య,చౌక ధరల దుకాణాల సంఘం అధ్యక్షులు నారాయణ రెడ్డి,రేషన్ డీలర్స్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## దాబా(బి) సర్పంచ్ సస్పెన్షన్

**ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21,( ప్రజా జ్యోతి)** అదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం దాబా(బీ) సర్పం చ్ నారవతె ఈశ్వర్ ను స స్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. స ర్పంచ్ గత కొంత కాలం నుంంంచి నకిలీ విత్తనాలు విక్రయిస్తూ రైతులను నిలువు దోపిడి చేస్తున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. గ్రామ పంచాయతీ ప్రజలకు జవా బుదారీగా ఉండాల్సిన సర్పంచ్ దానిని ధిక్కరించి అక్రమ సంపాదనే ధ్యేయంగా నకిలీ విత్తనాలను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటు న్నారు. ప్రజా పాలన, గ్రామ పంచాయతీ అభివృద్ధి పక్కన పెట్టి, తన స్వలాభం కోసం సర్పంచ్ పదవిని అడ్డం పెట్టుకొని అక్రమ సంపా దనకు ఎగబడుతు న్నాడు. ఈ నేపథ్యంలో రెండుసార్లు ఈ సర్పంచి నకిలీ విత్తనాలతో పట్టు బడ్డట్లు తెలుస్తోంది. మహారాష్ట్ర నుంచి అతి తక్కువ ధరకు నకిలీ విత్త నాలు తీసుకొచ్చి ఈ ప్రాం తంలో అధిక ధరకు రైతులకు కట్ట బెడుతున్నట్లు సమాచారం. వివరాలిలా ఉన్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో గల గ్రామ పంచాయ తి దాభా (బి), మండలము ఇచ్చోడ సర్పంచ్ నారవతే ఈశ్వర్‌న విధులు విస్మరించి రైతులకు అనధికారంగా పత్తి విత్తనాలు విక్రయిస్తున్నట్లుగా గమనించి (34) బస్తాలు టాస్క్ ఫోర్స్ టీం స్వాధీనంచేసుకొని ప్రథమ సమాచార నివేదిక (ఎఫ్ ఐ ఆర్) పోలీస్ స్టేషన్ ఇచ్చోడలో కేసు నమోదు చేశారు. తదుపరి చర్యల నిమిత్తము అసిస్టెం ట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ (ఆర్) ఇచ్చోడ నివేదికను అనుసరించి జిల్లా వ్యవసాయ అధికారి ఆదిలాబాద్ సమర్పించిన నివేదిక ఆధారంగా తెలంగాణ పంచాయ తిరాజ్ చట్టం -2018 పరి చ్ఛేదము 37(5) ప్రకారము జిల్లా కలెక్టర్ (ప.వి), ఆదిలాబాద్ జారీ చేసిన ఉత్త ర్వుల ప్రకారం నారవతే ఈశ్వర్ సర్పంచ్ గ్రామ పం చాయతి దాభా (బి), మండ లము ఇచ్చోడ కి షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరారు. అట్టి షో కాజు నోటీసుకు సర్పంచ్ సమర్పించి న సంజాయిషీ అసంతృప్తి క రంగా ఉన్నందున క్రిమినల్ కేసు నమోదు చేశారు. ఈ మేరకు సర్పంచ్ పదవిలో కొన సాగకుండా తాత్కాలి కంగా సర్పంచ్ ను సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ (ప.వి), ఆదిలాబాద్ ఉత్తర్వులు జారీ చేశారు.

## రైల్వే అండర్‌బ్రిడ్జిలో నిలిచిన వర్షపు నీరు..

**రాకపోకలకు తీవ్ర అంతరాయం**



**తాండూర్: జూలై 21** ప్రజాజ్యోతి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా రైల్వే అండర్‌బ్రిడ్జిలో భారీగా వర్షపు నీరు చేరింది. దీంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు పూర్తిగా నిలిచిపోవడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్లు వెళ్లలేక రాకపోకలు నిలిచిపోయాయి. అండర్‌బ్రిడ్జిలో నీరు నిలిచిపోవడంతో ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలను ఆశ్రయించాల్సి వస్తోంది. ముఖ్యంగా ఉద్యోగులు, విద్యార్థులు సమయానికి తమ గమ్యస్థానాలకు చేరుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వచ్చినప్పుడల్లా ఇదే సమస్య పునరావృతమవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి అండర్‌బ్రిడ్జిలో నిలిచిన నీటిని తొలగించి, శాశ్వత పరిష్కారం కోసం డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని ప్రజలు కోరుతున్నారు.

## సోన్ మండల కేంద్రంలో మండల సమీక్షా సమావేశంలో పాల్గొన్న బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**సోన్, జూలై 21(ప్రజా జ్యోతి)** సోన్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల సమీక్షా సమావేశంలో బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజలకు మెరుగైన సేవలు అందేలా సమర్ధవంతంగా పనిచేయాలని అధికారులకు సూచించారు. అలాగే అభివృద్ధి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేసుకోవాలి



**బోథ్, జూలై 21 (ప్రజా జ్యోతి)** మండలంలోని దన్నూరు బి, బిర్లగొంది, అందరూ గ్రామాలలోని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను మంగళవారం ఎంపీడీవో ఎల్ రమేష్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మొదటి విడతలో భాగంగా మంజూరైన ఇండ్ల నిర్మాణాలను త్వరతగతిన పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానమంత్రి రాష్ట్రీయ బా ల పురస్కార్ అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21, (ప్రజా జ్యోతి)** ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల పుర స్కారం అవార్డులకు (పి ఎం ఆర్ బి పి) జూలై 31లోపు (31-07-2026) ద రఖాస్తు లు స్వీకరిస్తామని జిల్లా బాల ల పరిరక్షణ అధికారి రాజేం ద్రప్రసాద్ ఒక ప్రక టనలో తెలిపారు. జిల్లాలో 6 నుంచి 18 సంవత్సరాల బాల బాలికలు దీనికి అర్హులని పేర్కొన్నారు. ధైర్యం, స మాజ సేవ, పర్యావరణ పరి రక్షణ, క్రీడలు సాంస్కృతిక కళలు, సైన్స్ అండ్ టెక్నాల జీ రంగాలలో అత్యుత్తమ ప్ర తిభ కనబరిచిన బాలలు సంబంధిత సపోర్టింగ్ డాక్యు మెంట్లతో అంతర్జాలంలో అని వెబ్సైట్లో నమోదు చే సుకోవాలి అని తెలిపారు. మరిన్ని వివరాలకు 94402 89825, 944055 5872 లను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఓటరు జాబితా సవరణకే (సర్) ప్రాధాన్యత

**జన్మదిన వేడుకలకు దూరం**

**ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి**



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21, (ప్రజా జ్యోతి)** కాంగ్రెస్ అధిష్టానం ఆదేశాల మేరకు ప్రస్తుతం జరుగుతున్న ఓటరు జాబితా సవరణ (సర్) ప్రక్రియకే తాను పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నానని,ఈ కార్యక్రమానికి ఆటంకం కల గకూడదనే ఉద్దేశం తోనే తన జన్మదిన వేడుకలకు దూరంగా ఉంటున్నానని ఆదిలా బాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీ కాంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదిలాబాద్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడారు. ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నట రాజన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదే శాల మేరకు ఆగస్టు మూడ వ తేదీ వరకు ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తమ గ్రామాల్లో, మండలాల్లో అందుబా టులో ఉండాలని ఆయన సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంతో పాటు, ఏ ఒక్క ఓటు కూడా గల్లంతు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో సిరి సన్న గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి కేవలం ఒక్క ఓటు తేడాతో ఓ డిపోయిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. 2028 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధి కారంలోకి తెచ్చి రేవంత్ రెడ్డి ని ముఖ్యమంత్రిగా, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిగా చేయడమే లక్ష్యంగా అందరం సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్త లు తన పుట్టినరోజు వేడుకల కోసం ఆటంకాలు సృష్టించ కుండా, ప్రజలకు అందుబాటులో ఉండి ఒక్క ఓటు కూడా పో కుండా కాపాడటమే తనకు ఇచ్చే అసలైన కానుక అని ఆయన పేర్కొన్నారు. ఆది లాబాద్ జిల్లాలో సోమవారం నుండి వర్షాలు కుర వడం పట్ల శ్రీకాంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తాంసి మండలంలో సర్ ప్రోగ్రాం పర్యట నలో ఉన్న సమయంలో రైతులు సంతోషంగా ఉండటం చూశానని, నీళ్లు లేక ఇ బ్బంది పడుతున్న రైతాంగానికి ఈ వానలు ఎంతో ఊర టనిచ్చాయని, రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి రైతులు ఎల్లప్పుడూ సుఖ సంతోషాలతో ఉండాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఆయన తెలిపారు. మీడియా సమావేశంలో మావల సర్పంచ్ ధర్మపురి చంద్రశేఖర్, నాయకులు ఎస్ కె అలీమ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజీనామా చేయమంటే లాఠి చార్జీ చేస్తారా...?

**నిరుద్యోగ యువత - విద్యార్థుల పై లాఠిచార్జీ చేయడ మేనా దేశభక్తి..?**


**నీట్ పేపర్ లీకెజికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా చేయాలి**

**సిపిఐ (ఎంఎల్ ) న్యూడె మోక్రసీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.వెంకట నారాయణ**




**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21,( ప్రజా జ్యోతి)**ఁనీట్ పేపర్ లీకేజ్ కి నైతిక బాధ్యత వహిస్తూ రాజీనా మా చేయమంటే విద్యార్థు లపై, నిరు ద్యోగులపై లాఠీ చార్జీ చేస్తారా ....ఇదేనా బి జెపి దేశభక్తి .... అని సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చే శారు. తక్షణమే నీటి పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని ఐఎంఎల్ న్యూడె మోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి వెంకట్ నారాయణ డిమాండ్ చేశారు.నీట్ పేపర్ లికేజ్ కి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చే యాలనీ డిమాండ్ చేస్తూ దేశ రాజధాని ఢిల్లీలో శాంతి యుతంగా ఆందోళన చేస్తున్న నిరుద్యోగులు -విద్యార్థుల పైన లాఠిచార్జీ, టియ్యర్ గ్యాస్ ప్రయోగించడాన్ని నిరసిస్తూ సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ కేంద్ర కమిటీ ఇచ్చి న పిలుపులో భాగంగా ఆది లాబాద్ లోని దస్నాపూర్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జరిగి న కార్యక్రమంలో సిపిఐ (ఎంఎ ల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి. వెంకట నారాయణ మాట్లా డుతూ గత 2 నెలల నుండి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చే యాలనీ డిమాండ్ చేస్తూ, రాజ్యాంగాను చేతులో ప ట్టుకొని, అంబేద్కర్ ఫోటో తో దేశ వ్యాప్తంగా శాంతి యుతంగా ఆందోళన, నిరసన కార్యక్రమం చేస్తున్న నిరుద్యోగ యువత పై, నీట్ విద్యార్థు ల పైలాఠి ఛార్జి చేయడం, టియర్ గ్యాస్ తో కాల్పులు జరపడం సిగ్గు చేటు అని, దేశభక్తి అంటే లాఠి ఛార్జి చేసి, కాల్పులు జర పడ మేనా అని ప్రశ్నించారు. నరేంద్ర మోడీ విద్యార్థుల పట్ల ఏమాత్రం చిత్త శుద్ధి ఉన్న ధర్మేంద్ర ప్రధాన్‌ని భర్త రఫ్ చేయాలనీ, భారత రాజ్యాంగం పట్ల ఏ మాత్రం గౌరవం ఉన్న ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలనీ,దేశంలో రోజు రోజు కి నిరుద్యోగ సమస్య పెరిగిపోతుందని, నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయడంలో బీజేపీ, మోడీ ప్రభుత్వం విఫలం అయిందని, మోడీకి అంబా నీ, ఆధాని పట్ల ప్రేమ,భక్తి ఉన్నట్లు దేశ భవిష్యత్తు పట్ల, విద్యార్థుల పట్ల భక్తి లేదని, ఎన్ టి ఏను రద్దు చేయాలనీ,విద్యా శాఖ మంత్రి రాజీనామా చేయాలనీ, లేకుంటే ఢిల్లీలో రైతులు చేసి న ఉద్యమ స్ఫూర్తితో, అదే తరహాలో నిరుద్యోగ యువత, విద్యార్థులు కలిసి దేశ వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హె చ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడె మోక్రసీ నాయకులు సుభా ష్, మారుతీ, గణేష్, దీపలక్మి, హరీష్, మెస్రం మారుతీ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గిరిజన గురుకుల డిగ్రీ కళా శాలలో స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల




**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21, (ప్రజా జ్యోతి)** అదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఉన్న తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీకళా శాలలో " స్టూడెంట్ కౌన్సిల్ ఎన్నికల" కు సంబంధించిన ఎన్నికల షెడ్యూల్ ను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివ కృష్ణ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ముంతాజ్ బేగం, ఇకాక్ కోఆర్డినేటర్ రామ కృష్ణ, ఎన్నికల రిట ర్నింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ ల క్ష్మణ్ పుట్ట పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల షె డ్యూల్ వివరిస్తూ నామి నేషన్స్ 21/ 7/ 2026 నుం డి 23/ 7/ 2026 వరకు స్వీకరించ బ డునని 24వ తారీఖున నా మినేషన్స్ పరిశీలన / నామి నేషన్స్ ఉపసంహరించు కో వడం, ప్రచారము 25/ 7/ 26 నుండి 27/7/26 సా యంత్రం 5.00 గంటల వరకు చేసుకోవచ్చు అని, ఎన్ని కలు 28/7/26 రోజునా 9. 00 గంటల నుండి మధ్యా హ్నం 1.00 గంటల వరకు మరియు 2.30 నిముషాల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు రిజల్ట్స్ విడుదల చెయ్యడం జరుగుతుంది అని ఎన్నికల రిటర్నింగ్ అధికారి గా...(స్టేజ్ ) వ్యవహరిస్తున్న రాజనీతి శాస్త్ర విభాగ లెక్చరర్, లేఫ్టిం ట్ లక్ష్మణ్ పుట్ట తెలియ జేశారు. భారత దేశం ఒక పెద్ద ప్రజా స్వామ్యం గల దేశం అని, ప్రజాస్వామ్యం విజయవంతం కావాలంటే ప్రజలకూ ఎన్నికల పట్ల భాధ్యత ఉండాలని మా కాలేజీలో విద్యార్థులందరికి ఎన్ని కల పట్ల పూర్తిగా అవగాహ నాకల్పించాలనే ఉద్దేశంతోనే కాలేజీ కౌన్సిల్ ఎలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు తెలియ జేశారు. ఈ సందర్భంగా కాలే జీ ప్రిన్సిపాల్ రాజనీతి శాస్త్ర విభాగ లెక్చరర్ కూ అభి నందనలు తెలిపారు. ఈ కా ర్యక్రమం లో కాలేజీ లెక్చరర్స్ విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

## సోనాల మండలంలో ఎస్ఐఆర్ ప్రక్రియ 100% పూర్తి



**సోనాల, జులై 21( ప్రజాజ్యోతి ):**సోనాల మండలంలో గత కొన్ని రోజులుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ఈ రోజుతో విజయవంతంగా 100% పూర్తి చేసుకున్నామని మండల రెవిన్యూ అధికారి మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా గుడాల అనీష్ మాట్లాడుతూ ఈ ప్రక్రియ లో బిఎల్ ఓలు మరియు అధికారుల కృషి అభినందనీయం అని వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారు లు డిటీ ప్రేమ్ నివాస్ ఆర్ఐ సునీత,సునీల్,బిఎల్ ఓలు అశోక్, అజర్,నాగరాణి మార్కెట్ డైరెక్టర్ జంగాల భోజన్న, మరియు యువకులు విశాల్ సింగ్, చౌహాన్,హరీష్, సుగుణాకర్, శ్రీకాంత్, కన్నా తదితరులు ఉన్నారు.

## మీ కోసం పోలీస్: బోథ్ పోలీస్ అవగాహన కార్యక్రమం



**సోనాల, జులై 21( ప్రజాజ్యోతి ):** సోనాల మండల కేంద్రంలో సీఐ గురుస్వామి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా సీఐ గురు స్వామి మాట్లాడుతూ గ్రామం లో ప్రతి ఒక్కరు తమ నివాసాలకు నిఘా నేత్రాలు ఏర్పాటు చేసుకోవాలని గత కొన్ని రోజులుగా జరుగుతున్న సంఘటనల పట్ల అప్రమత్తం గా ఉండాలని ,ఎటువంటి అత్యవసర పరిస్థితి ఉన్నా కూడా డయల్ 100 ని సంప్రదించా లని,మీ కోసం పోలీసులు ఎల్లవేళలా అండగా ఉంటారని అన్నారు.. ఈ కార్యక్రమంలో నాయకులు,గ్రామస్తులు పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నైరుతి రిటర్న్స్...

**హైదరాబాద్ :** ఎల్‌నినో ప్రభావంతో కొన్ని వారాలుగా అడపాదడపా వర్షాలు తప్పా.. వరణుడి కరుణ లేదు. ఉక్కపోతతో కూడిన వాతావరణం.. రైతులలో పెరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో వాతావరణ శాఖ వర్షాలపై కీలక అప్డేట్ ఇచ్చింది. దేశంలో పలుచోట్ల నైరుతి రుతుపవనాలు యాక్టివ్ అయ్యాయని వాతావరణ శాఖ తెలిపింది.. రాబోయే రోజుల్లో భారతదేశ నైరుతి రుతుపవనాలు తిరిగి బలం పుంజుకునేందుకు అవకాశం ఉండటంతో.. రాబోయే రోజుల్లో వర్షాలు కురుస్తాయని ఐఎండీ.. అంచనా వేసింది. ప్రస్తుతం.. విస్తారంగా వర్షాలు కురవడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలంగా మారుతున్నాయని.. ఆదివారం నుంచి వర్షపాతం క్రమంగా పెరిగి, వచ్చే వారం దేశంలోని పలు ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డి) పేర్కొంది. విడతల వారీగా కురిసే వర్షాలు నేలలో తేమను మెరుగుపరచి, పంట పెరుగుదలకు తోడ్పడి, మైదాన ప్రాంతాలంతటా నిరంతరంగా ఉన్న వేడి నుండి ఉపశమనం కలిగిస్తాయని అంచనా వేసింది.జూలై నెలలో చాలా వరకు రుతుపవనాలు బలహీనపడటానికి బంగాళాఖాతంలో బలమైన వాతావరణ వ్యవస్థలు లేకపోవడమే కారణమని చెప్పవచ్చు.

# నీట్ పేపర్ లీకేజీ లపై కేంద్ర ప్రభుత్వం మౌన మేంటి?

నీట్ పరీక్ష పేపర్ లీకేజీ బా ధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి



**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21, (ప్రజా జ్యోతి)** నీట్ పరీక్షా పేపర్ లీకేజీలపై కేంద్ర ప్రభుత్వం మౌనం వహించడం సరైంది కాదని ప రీక్ష పేపర్ లీకేజీకి బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగా ణ విద్యార్థి పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర ఆర్గనైజర్ సెక్రెటరీ కొట్టూరి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ నీట్ పేపర్ లీకేజీ కారణంగా దేశ వ్యాప్తంగా విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురయ్యారని, దాదాపు 21 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు అత్యం త విషాద కరమని ఆవేదన వ్యక్తం చేశారు. 2014 నుంచి 2026 వరకు మొత్తం 14 2 పరీక్షల ప్రశ్నాపత్రాలు లీక్ కావడం కేంద్ర ప్రభుత్వ వైఫ ల్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల భవి ష్యత్తుతో చెలగాట మాడుతున్న కేంద్ర ప్రభుత్వం పార దర్శకం గా పరీక్షలు నిర్వహించడంలో పూర్తిగా విఫలమైందని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సింది పోయి వారిపైనే అణచివేత ధోరణి అవలంబిస్తోందని మండి పడ్డారు. నీట్ పరీక్షలను నిర్వహిస్తున్న ఎన్ టీ ఏ సంస్థను వెంటనే రద్దు చేసి, పారదర్శకమైన పరీక్షా వ్యవస్థ ను ఏర్పాటు చేయాలని డి మాండ్ చేశారు. నేడు ఢిల్లీలో జరిగిన "చలో పార్లమెంట్" కార్యక్రమంలో విద్యార్థులపై పోలీ సులు దాడి చేయడం అత్యంత సిగ్గుచేటని ఖండించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్ల ను అణచివేయడం ప్రజాస్వా మ్యానికి విరుద్ధమని అన్నారు. దోషులను కఠినంగా శిక్షించాలని లేనిపక్షంలో టీజీ వీపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా, పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బోథ్ నియోజకవర్గ ఇంచార్జ్ సతీ ష్ ఖానాపూర్ నియోజకవర్గ కన్వీనర్ ప్రభాస్ విద్యార్థులు పాల్గొన్నారు

# మట్కాపై ఉక్కుపాదం

- మట్కా నిర్వాహకులు, ఆట గాళ్లపై జిల్లా పోలీసుల స్పెషల్ డ్రైవ్
- 10 పోలీస్ స్టేషన్ల పరిధిలో 20 ప్రత్యేక బృందాలతో ఏక కాలంలో తనిఖీలు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్,
- జిల్లా వ్యాప్తంగా 34 మంది వ్యక్తుల పై కేసులు నమోదు
- 54 మంది మట్కా నిర్వాహకులు, ఆటగాళ్లపై తనిఖీలు
- ఆన్‌లైన్ మట్కా జూదంలో పాల్గొంటున్న పలువురిపై కేసుల నమోదు
- మట్కా రహిత ఆదిలాబాద్ జిల్లానే లక్ష్యం





**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21, (ప్రజా జ్యోతి)** మట్కా వంటి అక్రమ జూద కార్యకలా పాలకు పాల్పడే వారిపై ఎలాంటి ఉపేక్ష ఉండదని, యువత భవిష్యత్తు ను నాశనం చేసే ఈ సామాజిక దురాచారాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు సోమవారం జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐపీఎస్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 పో లీస్ స్టేషన్ల పరిధిలో 20 ప్ర త్యేక పోలీసు బృందాలతో సమన్వయంగా స్పెషల్ డ్రై వ్ నిర్వహించి, మట్కా ని ర్వాహకులు, బుకీలు, ఆట గాళ్లు కలిపి దాదాపు 54 మందిపై ఏకకాలంలో తని ఖీలు చేపట్టినట్లు తెలిపారు. మావల ఆదిలాబాద్ టు టౌన్, ఇంద్రవెల్లి, ఉట్నూర్, ఇ చ్చోడ, బోథ్ మండల పోలీస్ స్టేషన్లలో మొత్తం జిల్లా వ్యాప్తంగా 34 మందిపై కేసులను నమోదు చేసినట్లు తెలిపారు. ఆన్‌లైన్ వేదికల ద్వారా మట్కా జూదం నిర్వ హిస్తున్న, ఆడుతున్న పలు వురిని గుర్తించి కేసులు నమోదు చేసి దర్యాప్తు చేప ట్టినట్లు వెల్లడించారు. మట్కా జూదం కారణంగా కు టుంబాలు ఆర్థికంగా దెబ్బ తింటాయని, అప్పుల ఊబిలో చిక్కుకుని అనేక మంది జీవితాలను నాశనం చేసు కుంటున్నారని తెలిపారు. సులభంగా డబ్బు సంపా దించాలనే ఆశతో యువత ఇటువంటి అక్రమాలకు ఆక ర్షితులవుతున్నారని, చివరకు చట్టపరమైన చర్యలతో పాటు తమ భవిష్యత్తును కూడా కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. మట్కా నిర్వహించే నిర్వాహకులు, బుకీలు, ఆ టగాళ్లు, ఆన్‌లైన్ ద్వారా బెట్టింగ్ నిర్వహించే వారిపై నిరంతర నిఘా కొనసాగుతోందని, సాంకేతిక ఆధారాలతో వారి కార్యకలాపాలను గుర్తించి కఠిన చర్యలు తీసు కుంటామని స్పష్టం చేశారు. మట్కా ద్వారా అక్రమంగా సంపాదించిన ఆస్తుల వివ రాలను కూడా పరిశీలించి చట్టపరమైన చర్యలు తీసు కునే దిశగా చర్యలు కొనసా గుతాయని తెలిపారు. జిల్లా లో గంజాయి, డ్రగ్స్, మట్కా క్రికెట్ బెట్టింగ్, అక్రమ మ ద్యం, సైబర్ నేరాలు తదిత ర అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్‌లు నిరంతరం కొనసాగు తాయని, నిబంధనలను అతిక్రమించి నిర్వహిస్తున్న వా రిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరిం చారు. ప్రజలు, ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల కదలికలపై నిఘా ఉంచాల ని, యువత చెడు వ్యసనా లకు దూరంగా ఉండేలా అ వగాహన కల్పించాలని సూ చించారు. మట్కా లేదా ఇ తర అక్రమ జూద కార్యక లాపాల గురించి సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తెలిసిన పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. ప్రజల సహకా రంతో ఆదిలాబాద్ జిల్లాను మట్కా రహిత జిల్లాగా, అసాంఘిక కార్యకలాపాలకు తావులేని సురక్షిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని పి లుపునిచ్చారు.

# ట్రాన్స్ఫార్మర్ దొంగల ముఠా అరెస్ట్

**8 మంది పై రూరల్, మావల పోలీస్ స్టేషన్ లలో పది కేసులు నమోదు**

**రైతులకు కరెంటు కష్టాలు వచ్చేలా చేస్తున్న దొంగలు వివరాలను వెల్లడించిన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్**

**100 కిలోల రాగి తీగ (8 ట్రాన్స్ఫార్మర్ల, రెండు 5 హెచ్పి మోటర్ల రాగితీగ) స్వాధీనం**

**దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు**

**దొంగలతో కుమ్మక్కై, దొంగ తనాలు చేయిస్తున్న స్క్రాప్ షాపు యజమానులు**






**ఆదిలాబాద్ బ్యూరో, జూలై 21,( ప్రజా జ్యోతి)** ~1) జాధవ్ సంతోష్ (26) మధుకర్, కేఆర్కే కాలనీ, మావల, ఆదిలాబాద్. 2) మీరాల సంతోష్ (31) మీరాల బుచ్చన్న, బంగారిగూడ, ఆదిలాబాద్. 3) మండ్వాకర్ నవ్వడు అలియాస్ నవనాథ్ (24) సాహెబ్రావు, రుయ్యాడి, తలమడుగు మండలం. 4) సరేళా రవి అశోక్, రుయ్యాడి, తలమడుగు మండలం, ప్రస్తుతం కేఆర్కే కాలనీ, మావల, ఆదిలాబాద్. (పరారీ). 5) ఒక బాలుడు. దొంగిలించిన ఆస్తిని కొనుగోలు చేసిన వ్యక్తులు 6) షేక్ అఫ్రోజ్ (43) ఫైజర్ రహ్మాన్, ఉట్నూర్. 7) అబ్దుల్ నౌషీర్ అలియాస్ నౌషాద్ మతీన్, అబ్దుల్లా చౌక్, ఖానాపూర్, ఆదిలాబాద్. 8) టిటిల్ కరణ (27) రాజేందర్, మిలింద్ నగర్, ఇంద్రవెల్లి. (పరారీ) గత సంవత్సర కాలంలో ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధి లో మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని వ్యవసాయ భూములలో రైతులకు కష్టాలు, పంట నష్టాలు కలిగించేలా ట్రాన్స్ఫార్మర్లను దొంగతనం చేస్తున్న దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్ మంగళవారం స్థా నిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావే శంలో వివరాలను వెల్లడించారు. నేరాలకు పాల్పడే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని వారిపై కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితులు ఐదు గురు అందులో ఒక బాల నేరస్థుడు కలిసి ఒక ముఠాగా ఏర్పడి రాత్రి సమయాలలో ట్రాన్స్ఫా ర్మర్లను దొంగతనం చేస్తూ తక్కువ ధరకు స్క్రాప్ దుకాణ యజమా నులకు అమ్ముతూ నేరాలకు పాల్ప డుతున్నారని విషయాన్ని తెలిపారు. ఈ ముఠాపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో 8 కేసు లు మావల పోలీస్ స్టేషన్లో రెండు కేసులు నమోదు అయినట్లు తెలిపారు. గతంలో ఈ ముఠా సభ్యులు జైనథ్లో దొం గతనాలకు పాల్పడి జైలుకు సైతం వెళ్లి వచ్చినట్లు తెలిపారు. ట్రాన్స్ఫార్మర్ దొంగలను ఎలాగైనా పట్టుకోవాలని ఉద్దేశంతో గత కొద్ది రోజుల క్రితం జిల్లా ఎస్పీ అఖిల్ మ హాజన్ ప్రత్యేకంగా రెండు బృందాలను ఏర్పాటు చేసి వీరిని మంగళవారం ఉదయం పట్టుకోవడం జరిగిందని పత్రికా సమావేశంలో వివరాలను వెల్లడించారు. బృంద సభ్యులు దొంగతనాలకు పాల్పడి ట్రాన్స్ఫార్మర్ లో ఉన్న రాగి తీగలను తీసి తక్కువ ధరకు స్క్రాప్ దుకాణ యజమానులకు అమ్ముతూ ఉండేవారని, ఈ దుకాణ యజమానులు తక్కువ ధరకు రాగి తీగలను కొనుగోలు చేసి సొమ్ము చేసుకునేవారని, కొన్ని సంద ర్భాలలో ఈ దుకాణ యజమానులే దొంగలతో కుమ్మ క్కై దొంగత నాలు చేసేలా ప్రోత్సహించే వారిని వివరించారు. ఈ ట్రాన్స్ఫార్మర్ దొంగల వల్ల ప్రభుత్వానికి, విద్యుత్ శాఖకు, రైతులకు పంట రూపంలో నష్టం జరుగుతుందని తెలిపారు. వీరి వద్ద నుండి 100 కిలోల రాగి తీగను (ఒక లక్ష 50 వేల విలువ చేసి), రెండు మొబైల్ ఫోన్స్ రెండు వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. కేసును చేదించడంలో కీలక పాత్ర పోషించిన రూరల్ సీఐ, రూరల్ ఎస్సై, సిబ్బంది మంగళ్ సింగ్, కరీంలను సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆదిలా బాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి, రూరల్ సీ ఐ రహీం పాషా, రూరల్ ఎస్సై వి విష్ణు వర్ధన్, సిబ్బంది మంగల్ సింగ్, అబ్దుల్ కరీం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 30లోగా అన్ని గురుకుల విద్యాసంస్థల తనిఖీలు పూర్తి చేయాలి

**ప్రతి ఆర్సీవో వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలి**

**విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు క్రీడలు, కళల్లోనూ ప్రతిభను పెంపొందించాలి**

**సంక్షేమ గురుకుల విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి పొన్నందిశా నిర్దేశం**

**హైదరాబాద్** : మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (ఓఏఖుఃఅచిఖీఇమా) పరిధిలోని అన్ని గురుకుల విద్యాసంస్థలను ఈ ఏడాది ఆగస్టు 30లోగా పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని అధికారులను మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, సురక్షిత వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం . బీసీ గురుకుల విద్యాసంస్థల నిర్వహణ, విద్యా ప్రమాణాలు, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమంపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. గురుకుల విద్యాసంస్థల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా వాతావరణాన్ని కల్పించేలా అధికారులు పనిచేయాలని,ప్రతి రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ (ఖీఅూ) వారానికి మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ కనీసం ఆరు గురుకుల విద్యాసంస్థలను సందర్శించాలని ఆదేశించారుర. ఆర్సీవోలు కేవలం పర్యవేక్షణకే పరిమితం కాకుండా ప్రధాన కార్యాలయం, జిల్లా యంత్రాంగం, విద్యాసంస్థల మధ్య సమన్వయం కల్పించే సంధాన కర్తలుగా వ్యవహరించాలని సూచించడం జరిగింది. సొంత భవనాలు లేని గురుకుల విద్యాసంస్థలకు భూముల సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని, ఇందుకోసం సంబంధిత జిల్లా కలెక్టర్లతో సమావేశమై అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే, ఏ నియోజకవర్గానికి అనుమతి పొందిన విద్యాసంస్థ అదే నియోజకవర్గ పరిధిలో భవనాలను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించి. అద్దె భవనాలకు చెల్లించే మొత్తంలో ఆరు శాతం నిధులను భవనాల మరమ్మతులకు తప్పనిసరిగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి విద్యాసంస్థలో రెయిన్వాటర్ హార్వెస్టింగ్ వ్యవస్థలను సమర్థవంతంగా అమలు చేసి భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించడం జరిగింది . తల్లిదండ్రుల నుంచి వచ్చే ఫిర్యాదులు, సూచనలు, సలహాలను ఎప్పటికప్పుడు ప్రధాన కార్యాలయానికి తెలియజేసి వాటిపై సత్వర చర్యలు తీసుకోవాలని. విద్యార్థులకు పాఠ్యాంశాల్లోనే కాకుండా క్రీడలు, కళలు, వ్యక్తిత్వ వికాసం వంటి రంగాల్లోనూ ప్రోత్సాహం అందించి సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని సూచించి,ప్రతిభ గల విద్యార్థుల వివరాలు తెలియజేస్తే వారికి

## యూనిఫాం 50 శాతంపై సౌత్ స్టేట్స్ హ్యాపీ

**హైదరాబాద్ :** దేశంలో నియోజకవర్గాల పునర్విభజ అంశం సరికొత్త మలుపు తిరిగింది. జనాభా ప్రాతిపదికన మాత్రమే సీట్ల విభజన జరిగితే ఉత్తరాది రాష్ట్రాల సీట్లు విపరీతంగా పెరిగి, జనాభా నియంత్రణను పక్కాగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పార్లమెంట్లో దారుణంగా పడిపోతుందనే భయాలు ఇన్నాళ్లూ ఉండేవి. అయితే, కేంద్ర ప్రభుత్వం తెరపైకి తెచ్చిన యూనిఫాం 50 శాతం సీట్ల పెంపు ఫార్ములా ఈ సమీకరణాలను పూర్తిగా మార్చేసింది. ఏ రాష్ట్రానికీ ఉన్న సీట్లు తగ్గకుండా, ఉన్న స్థానాలను యాభై శాతం పెంచే ఈ మధ్యేమార్గ ఫార్ములాకు దక్షిణాదిలోని ప్రధాన ప్రాంతీయ పార్టీలు లోపాయకారీగా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో బలమైన చర్చ నడుస్తోంది.నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) పై కేంద్రం ప్రతిపాదించినట్లుగా ప్రచారం జరుగుతున్న "యూనిఫాం 50 శాతం సీట్ల పెంపు ఫార్ములా" పట్ల దక్షిణాది పార్టీలు సానుకూలంగానే ఉన్నట్లు తెలుస్తోంది.

**దక్షిణాది పార్టీల వైఖరి సానుకూలత:**

జనాభా ప్రాతిపదికన మాత్రమే డీలిమిటేషన్ జరిగితే ఉత్తరాదితో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం పడిపోతుందనే భయాలు ఉండేవి. అయితే, ఏ రాష్ట్రానికీ ఉన్న సీట్లు తగ్గకుండా, ఉన్న స్థానాలను 50% పెంచే ఈ మధ్యేమార్గ ఫార్ములాకు దక్షిణాది ప్రాంతీయ పార్టీలు లోపాయకారీగా గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది.

డీఎంకే (తమిళనాడు): జనాభా ప్రాతిపదికన వెళ్తే తీవ్రంగా నష్టపోయే తమిళనాడు, ఈ ఫార్ములా వల్ల తమ సొంత రాష్ట్రంలో పొలిటికల్ స్పేస్ పెరగడమే కాకుండా పార్లమెంట్లో గొంతుక మరింత బలపడుతుందని భావిస్తోంది. ప్రాంతీయ ప్రయోజనాల దృష్ట్యా దీనిని తిరస్కరించాల్సిన అవసరం లేదని స్టాలిన్ ఒక అవగాహనకు వచ్చినట్లు సమాచారం.

బీఆర్ఎస్ (తెలంగాణ): పార్లమెంట్లో దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి నిష్పత్తి దారుణంగా పడిపోనంత కాలం, ఈ 50% పెంపుదల మోడల్ వల్ల తమకు వచ్చే నష్టమేమీ లేదని భావిస్తూ సానుకూల ధోరణిలోనే ఉంది.

**తమిళనాడు, తెలుగు రాష్ట్రాల సీట్ల సమీకరణాలు**

ఈ ఫార్ములా ప్రకారం మూడు రాష్ట్రాలలో సీట్ల సంఖ్య గణనీయంగా పెరగనుంది. దీనివల్ల ఎక్కువ మంది అభ్యర్థులకు అవకాశం లభించడంతో పాటు రాజకీయ పునరేకీకరణకు క్షేత్రస్థాయిలో మార్గం సుగమం అవుతుంది.రాష్ట్రాల వారీగా మారబోయే సీట్ల అంచనాలు:రాష్ట్రంప్రస్తుత లోక్సభ సీట్లు50% ఫార్ములా ప్రకారం పెరిగే సీట్లు (అంచనా)

| | | |
|---|---|---|
| తమిళనాడు | 39 | 59 |
| ఆంధ్రప్రదేశ్ | 25 | 37 - 38 |
| తెలంగాణ | 17 | 25 - 26 |

రాష్ట్రాలకు వచ్చే అదనపు సీట్లను, కేంద్ర నిధుల వాటాలను కోల్పోకూడదనే ఆర్థిక కోణంతో పాటు, ప్రాంతీయ అస్తిత్వం దెబ్బతినకుండా పార్లమెంట్లో బలం పెరుగుతుండటంతో డీఎంకే, బీఆర్ఎస్, టీడీపీ, వైఎస్సార్సీపీ సహా దాదాపు అన్ని పార్టీలు ఈ కొత్త పొలిటికల్ రియాలిటీని స్వీకరించే దిశగానే అడుగులు వేస్తున్నాయి.

## గ్యాప్ కంటిన్యూస్..

**మెదక్ :** బీఆర్ఎస్ పార్టీలో హరీష్ రావు వర్సెస్ కేటీఆర్ పంచాయితీ నడుస్తుంది అన్న గుసగుసలు, లీకులు కొత్తేమీ కాకపోయినా, తాజాగా రంగనాయక్ సాగర్ వద్ద జరిగిన హరీష్ రావు పాదయాత్ర మరోసారి ఆ ఆరోపణలకు బలం చేకూర్చినట్లైంది.కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నీటిని ఎత్తిపోసి ప్రాజెక్టులు నింపాలని, కరువులో రైతన్నలకు నీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ అన్నపూర్ణ సాగర్ నుండి రంగనాయక సాగర్ వరకు మాజీ మంత్రి హరీష్ రావు పాదయాత్ర చేశారు. హరీష్ రావు పాదయాత్రకు ఏర్పాట్లు కూడా భారీగానే జరిగాయి. భారీ ఫ్లెక్సీలు, బ్యానర్లు, జెండాలతో హరీష్ పాదయాత్ర సాగింది. అయితే, వాటిలో ఎక్కడా కేటీఆర్ ఫోటో లేదు. భారీ సైజులో హరీష్ రావు, చిన్నగా కేసీఆర్ ఫోటోతో మాత్రమే కనపడ్డాయి. దీంతో ఎంత సిద్ధిపేట కేంద్రంగా పాదయాత్ర చేసినా? పార్టీకి వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఉన్న కేటీఆర్ ఫోటో వేయటం కనీసం ప్రోటోకాల్. బాధ్యత.